RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:13 1-7-2025 మంగళవారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

# సిగాచీ బ్లాస్ట్


## బాధితులకు ప్రధాని సంతాపం

### మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్టపరిహారం



న్యూ ఢిల్లీ: (టుడే విదుర, జూన్ 30): సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని అన్నారు ప్రధాని మోదీ. ఈ ప్రమాదంలో తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్విట్ చేశారు.. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తునట్లు చెప్పారు. కాగా, మృతుల బంధువులకు ప్రధాన మంత్రి సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50,000 ఎక్స్ గ్రేషియా ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

# క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మనం అందిపుచ్చుకోవాలి: సీఎం చంద్రబాబు



అమరావతి(టుడే విదుర, జూన్ 30): : క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మనం అందిపుచ్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. 1990లలో ఇంటర్నెట్ వల్ల ప్రపంచం ఓ గ్లోబల్ విలేజ్‌గా మారిందని ఉ ద్ఘాటించారు. ఐటీపై ఆలోచన చేస్తే చాలదు... దానికి ఎకోసిస్టమ్ క్రియేట్ చేయాలని సూచించారు. ఇప్పుడు హైదరాబాద్ ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీలకు వేదికగా మారిందని వెల్లడించారు. క్వాంటమ్ వ్యాలీపై విజయువాడలోని నోవాటెల్‌లో ఇవాళ(సోమవారం) వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు పాల్గొని మాట్లాడారు. 1995 టెక్నాలజీ రివెల్యూషన్‌ను ఇండియా పొందింది.. దానిలో తన పాత్ర కూడా ఉందని గుర్తుచేసుకున్నారు సీఎం చంద్రబాబు. ఏపీకి ఎన్నో అడ్వాంటేజీలు ఉన్నాయని.. శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ ఇక్కడే ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని అన్నారు. ఏపీ గ్రీన్ ఎనర్జీలో చాలా బలంగా ఉందని చెప్పారు. 1989లో కుప్పం నుంచి పోటీచేస్తూ ఒక పబ్లిక్ మీటింగ్‌లో తాను ఎలక్ట్రానిక్ ఎక్సేంజ్ తెస్తానని చెప్పానని.. అయితే ఆ విషయంతో తన ప్రత్యర్థులు తప్పుపట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వ సర్వీసులు అన్నిసేవలను ఆగస్టు 15వ తేదీ నాటికి వాట్సాప్ చాట్ బోట్ ద్వారానే నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. జనవరి ఒకటోవ తేదీ నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ అమరావతి నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించారు. దీనికోసం ఎకో సిస్టంతో పాటు యూజ్ కేస్‌లు కూడా రావాలని సూచించారు. టాప్ ఏఐ యూసేజ్‌లో చైనా, యూఎస్, ఇండియా మాత్రమే ముందు ఉన్నాయని వివరించారు. టిసీఎస్ మనతో ముందునుంచి ట్రావెల్ చేస్తోందని.. ఇప్పుడు డేటాలింక్‌పై పనిచేస్తుందని వెల్లడించారు సీఎం చంద్రబాబు.

# పాశమైలారం ప్రమాదం దురదృష్టకరం - పవన్ కల్యాణ్




అమరావతి(టుడే విదుర, జూన్ 30): తెలంగాణ రాష్ట్రంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో చోటు చేసుకున్న ప్రమాదంలో 8 మంది కార్మికులు దుర్మరణం పాలవడం పట్ల ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్విట్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడం మూలంగా చోటు చేసుకున్న ఈ పరిశ్రమలో గాయపడ్డవారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. వారికీ, ఇతర క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కృష్ణమ్మ పరవళ్లు - నిండుకుండలా శ్రీశైలం జలాశయం


<u>శ్రీశైలం గేట్లు ఎత్తివేసే అవకాశం</u>

<u>జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం</u>

<u>కర్నాటక, మహారాష్ట్రలో కుండపోత వానలు</u>

<u>ఆల్మట్టి నుంచి జూరాలమీదుగా వరదపోటు</u>

<u>ప్రస్తుతం జల విద్యుత్ కోసమే నీటి విడుదల</u>



నంద్యాల,(టుడే విదుర, జూన్ 30): ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కృష్ణా నదికి పెద్ద ఎత్తున వరద పోటెత్తుతోంది. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు తరలివస్తోంది. 15 రోజులుగా ఏగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదలతో జలాశయం నిండుకుండలా మారింది. సోమవారం శ్రీశైలం ప్రాజెక్టు ఇన్ ఫ్లో 1,56,554 క్యూసెక్కులుగా కొనసాగుతుంది. ఇంతవరకు అవుట్ ఫ్లో లేదు. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టు జలాశయం 872.50 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్ధాయి నీటినిల్వ 215.7080 టీఎంసీలుకాగా ప్రస్తుతం 152.4941 టీఎంసీలుగా ఉంది. ఇక కేవలం 12.50 అడుగులు మాత్రమే జలాశయం నిండటానికి తక్కువగా ఉంది. ఈ నీరు జలాశయంలోకి వస్తే నేడో రేపో గేట్లెత్తే అవకాశం ఉన్నట్టు అధికారి వర్గాలు తెలిపాయి.

కర్నాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు..

ఏగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, కర్నాటకలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్రా నది పొంగి పొర్లుతుంది. ఆల్మట్టి డ్యామ్ నుంచి జూరాల ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద వస్తోంది. ఇక.. శ్రీశైలం జలాశయంలోకి 1,56,554 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. కృష్ణా పరివాహక ప్రాజెక్టులైన జూరాల నుంచి 26,072 క్యూసెక్కులు, స్పిల్ వే నుంచి 1,30,482 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. సుంకేసుల హంద్రీనీవా నుంచి నీరు విడుదల కాలేదు. ఇంతవరకు విద్యుత్ ఉత్పత్తికి సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విద్యుత్ ఉత్పత్తికి 621 క్యూసెక్కుల నీటిని.. తెలంగాణకు 6904 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్టు అధికారులు తెలిపారు..

## ఏపీ కేంద్రంగా

# క్వాంటమ్ టెక్నాలజీ విప్లవం: మంత్రి లోకేష్



అమరావతి(టుడే విదుర, జూన్ 30): : ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా క్వాంటమ్ టెక్నాలజీ విప్లవం ప్రారంభం అవుతోందని ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ అమరావతిని.. టెక్నాలజీ మ్యాప్‌లో చేర్చాలని వ్యాఖ్యానించారు. క్వాంటవ్ వ్యాలీపై విజయవాడలోని నోవాటెల్‌లో ఇవాళ(సోమవారం) వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో నారా లోకేష్ పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు మొదటి టెక్నాలజీ రెవెల్యూషన్‌ను పరిచయం చేసినప్పుడు తాను ఏడోతరగతి చదువుకుంటున్నానని గుర్తుచేశారు మంత్రి నారా లోకేష్.గ్లోబల్ రేస్‌లో చేరడం కాదు.. మనమే దారి చూపాలని మంత్రి నారా లోకేష్ సూచించారు. క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ వల్ల ఏపీ బ్రెయిన్ క్యాపిటల్‌గా మారుతోందని ఉద్ఘాటించారు. క్వాంటమ్ సైన్స్‌ను ఇంజ నీరింగ్‌లోనూ భాగం చేస్తున్నామని వెల్లడించారు. టెక్నాలజీ పరంగా ఏపీ వేగంగా పనిచేస్తోందని చెప్పారు. విజన్ అంటే ఇప్పుడు వెలాసిటీ , ఇన్నోవేషన్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్లోబల్ లీడర్లు , పెట్టుబడిదారులు తమతో కలసి పనిచేయాలని కోరారు. చంద్రబాబు లాంటి నాయకు డు ఏపీకి ఉండటం అదృష్టమని ప్రశంసించారు. చంద్రబాబు కేబినెట్‌లో ఐటీ మంత్రిగా ఉండటం తాను అదృష్టంగా భావిస్తు న్నానని ఉద్ఘాటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదలు పెట్టిన ఐటీ రంగం విస్తృతిని గతంలో చూశామని పేర్కొన్నారు మంత్రి నారా లోకేష్.

## బిజెపి అధ్యక్ష పదవులకు


# నామినేషన్ వేసిన మాధవ్, రామచంద్రరావు



విజయవాడ / హైదరాబాద్ (టుడే విదుర, జూన్ 30): తెలంగాణ, ఎపిలోని బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవులకు నామినేషన్ ప్రక్రియ నేటి సాయంత్రం ముగిసింది. ఎపి బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవికి మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, తెలంగాణ అధ్యక్ష పదవికి మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామచంద్రరావులు తమ తమ నామినేషన్ లు దాఖలు చేశారు.ఇక ఎపి అధ్యక్ష పదవి నామినేషన్ వేసిన పీవీఎన్ మాధవ్‌కు పార్టీలో మంచి పేరుంది. గతంలో ఆయన శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ సిద్ధాంతాలపై స్పష్టమైన అవగాహన, వాగ్ధాటి ఉన్న నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పార్టీ పగ్గాలను ఆయనకు అప్పగించాలని అధినాయకత్వం నిర్ణయించి నామినేషన్ వేయించింది.తెలంగాణలో ఆ పార్టీ సీనియర్ నేత నారపరాజు రామచందర్ రావు కు బిజెపి అధిష్టానం ఈసారి అవకాశం కల్పించింది..

# ఆయిల్‌పామ్ సాగు భళా

◆ కోటవురట్ల మండలం లింగాపురంలో ఆయిల్‌పామ్ సాగు
◆ జిల్లాలో పెరుగుతున్న సాగు విస్తీర్ణం
◆ తక్కువ పెట్టుబడితో అధిక లాభం
◆ ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి



కోటవురట్ల, (టుడే విదుర, జూన్ 30): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రభుత్వం ఈ పంట సాగుకు మొక్కలతో పాటు సబ్సిడీని కూడా ఇస్తుండడంతో దీని పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంట చేతికి వచ్చే సమయానికి ఫ్యాక్టరీలు అందుబాటులో ఉండడం, విదేశాలకు కూడా ఎగుమతి అయ్యే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన శాఖాధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలో సుమారు ఐదు వేల హెక్టార్లలో 2,100 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. కోటవురట్ల మండలం రాజుపేటలో పతాంజలి సంస్థ ప్లాంటేషన్ ఏర్పాటు చేసింది. దీని ద్వారా రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్నారు. రైతులు ఎకరాకు 53 నుంచి 57 మొక్కల వరకు నాటుతున్నారు. ప్రభుత్వం ఎకరాకు రూ.50 వేలు సబ్సిడీ ఇస్తుండగా, దీనిలో రూ.20 వేలు వరకు డ్రిప్ కోసం వినియోగిస్తున్నారు. మిగతా నగదును నాలుగేళ్ల పాటు సాగు కోసం వెచ్చించనున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,200 ఎకరాలకు అనుమతులు మంజూరుకాగా, 530 ఎకరాల్లో సాగు చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభంఆయిల్‌పామ్ ఐదు సంవత్సరాల నుంచి కాపు ప్రారంభమవుతుందని రైతులు చెబుతున్నారు. ఇరవై ఏళ్ల పాటు కాపు వస్తుందని, కూలీల అవసరం కూడా తక్కువేనని అంటున్నారు. పంట చేతికొచ్చే సమయంలో కోసిన వెంటనే 24 గంటల్లో ఫ్యాక్టరీకి తరలించాలి. పెట్టుబడి తక్కువ, లాభం ఎక్కువ ఉండడంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

# మన్యంలో భారీ వర్షం



చింతపల్లిలో వర్షం
రహదారులు జలమయం
పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు

పాడేరు,(టుడే విదుర, జూన్ 30): మన్యంలో రాత్రి నుంచి ఈదురుగాలులతో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తున్నది. గత రెండు రోజులుగా ముసురు వాతావరణం నెలకొనగా, తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా ఒడిశాను ఆనుకుని ఉన్న పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ వ్యవసాయ పనులు జరుగుతుండడంతో తాజా వర్షాలు తమకు అనుకూలిస్తాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దుక్కి, దమ్ము పనులకు వర్షపు నీరు ఎంతగానో ఉపయోగపడుతుందంటున్నారు. అలాగే భారీ వర్షాలకు ఎక్కడ చూసినా వర్షపు నీటితో పంట పొలాలు కళకళలాడుతున్నాయి. అయితే గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగానే కొనసాగాయి. ఆదివారం కొయ్యూరులో 34.8, పాడేరులో 30.8, చింతపల్లిలో 29.6, జీకేవీధిలో 28.9, పెదబయులు, డుంబ్రిగుడలో 28.0, అనంతగిరి, జి.మాడుగులలో 27.9, హుకుంపేటలో 28.5, అరకులోయలో 27.6, ముంచంగిపుట్టులో 26.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతపల్లి: మండలంలో ముసురు వాతావరణం నెలకొన్నది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. వర్షం వల్ల ప్రధాన రహదారులు జలమయమైపోయాయి. కోరుకొండ వారపు సంతల్లో వర్తకులు, వినియోగదారులు ఇబ్బంది పడ్డారు. వర్షంతో పాటు గాలి ఉండడంతో విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం కలిగింది. ముంచంగిపుట్టు: మండల పరిధిలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో వాగులు, మత్స్యగెడ్డ పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో మట్టి రహదారులు బురదమయంగా మారడంతో అటుగా వాహన రాకపోకలు అతికష్టంపై సాగిస్తున్నారు. మత్స్యగెడ్డ ప్రవాహిత నీటిపై ఆధారపడి ఉన్న జోలాపుట్టు, డుడుమ జలాశయాలకు వరదనీరు ఇన్‌ఫ్లో పెరిగిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

# విరగ్గాసిన డ్రాగన్ ఫ్రూట్

చింతపల్లి, (టుడే విదుర, జూన్ 30): మండలంలోని గొందిపాకలు పంచాయతీ చిక్కుడుబట్టి గ్రామంలో ఓ గిరిజన రైతు పెరట్లో డ్రాగన్ ఫ్రూట్ విరగ్గాసింది. అరుదైన ఉద్యాన పంటల్లో డ్రాగన్ ఫ్రూట్ ఒకటి. 2008లో తొలిసారిగా చింతపల్లి మండలం జల్లూరుమెట్ట గ్రామంలో తెనాలికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయ్‌శ్రీరామ్ డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టి మంచి ఫలితాలు సాధించాడు. నాటి నుంచి గిరిజన ప్రాంతంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తరించింది. ఈ పంట సాగుకు గిరిజన



చిక్కుడుబట్టిలో కాసిన డ్రాగన్‌ఫ్రూట్

ప్రాంత వాతావరణం అనుకూలించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సాగును ప్రోత్సహిస్తుంది. పాడేరు రెవెన్యూ డివిజన్‌లో అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, జీకేవీధి, చింతపల్లి మండలాల్లో గిరిజన రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. చిక్కుడుబట్టి గ్రామంలో గిరిజన రైతు వనుము సింహాచలం పెరటిలో పది డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు మూడేళ్ల క్రితం నాటాడు. మూడు మొక్కలు గత ఏడాది నుంచి కాపుకొస్తున్నాయి. ప్రస్తుతం సీజన్ కావడంతో డ్రాగన్ ఫ్రూట్స్ అధికంగా వచ్చాయి. ఒక్కొక్క మొక్క నుంచి 35-45 కాయలు వస్తున్నాయని, పింక్, వైట్ రకాల కాయలు కాస్తున్నాయని రైతు తెలిపాడు. డ్రాగన్ ఫ్రూట్ కాయలను రూ.30-40 ధరకు ప్రాంతీయ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్టు రైతు సింహాచలం తెలిపాడు.

# తట్టా బుట్టా సర్దుకుని..

పునరావాస కాలనీకి ట్రాక్టర్‌పై తరలిస్తున్న ఇళ్లలోని సామగ్రి
వరద భయంతో పునరావాస కాలనీలకు తరలిపోతున్న ప్రజలు
పరిహారం అందని నిర్వాసితులు సమీప గ్రామాల్లో అద్దె ఇళ్లకు మొగ్గు



వేలేరుపాడు,(టుడే విదుర, జూన్ 30): గతం లో వరదల సమయంలో ఎదుర్కొన్న చేదు అనుభవాల నేపథ్యంలో ముంపు మండలాల్లోని ప్రజలు ముందుగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. జూలై వస్తుందంటేనే ముంపు మండలాల ప్రజల గుండెల్లో గుబులు ప్రారంభమవుతుంది. గోదా వరికి వరదలు వచ్చే సమయం అసన్నమవుతుంది. ఏటా గోదావరి వరదల కారణంగా ఈ ప్రాంతంలోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదల సమయంలోనే గ్రామాల్లోని ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు అప్పటికప్పుడు తరలిపోవాలంటే అవస్థలు పడుతున్నా రు. ఇళ్లలోని సామాన్లు పూర్తిగా తరలించే సమయం ఉండకపోవడం వల్ల వరదలకు మునిగి పోయి తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ ప్రాంత ప్రజలు గత మూడేళ్లుగా వర దల కారణంగా ఎంతో నష్టపోయారు. 2022 జూలైలో వచ్చిన భారీ వరదల కారణంగా గ్రామా లకు గ్రామాలే నీటమునగా తీవ్ర ఆస్తి, పశు నష్టం సంభవించింది. అయా గ్రామస్థులు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టకుని వెళ్లాల్సి వచ్చింది. గతేడాది జూలై, ఆగస్టు, సెప్టెంబరు మూడు నెలల పాటు గోదావరి వరదలు, పెదవాగు బీభత్సం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలా గత చేదు అనుభవాల నేపథ్యంలో ప్రజలు ఈ ఏడాది ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇళ్ల ప్యాకేజీల సొమ్ములు జమ అయినవారు తమకు కేటాయించిన పునరావాస కాలనీలకు తరలిపోతుండగా ప్యాకేజీ అందని వారు సొంత భూములు ఉండి వ్యవసాయం చేసుకునేవారు మండలంలోని శివకాశీపురం, భూదేవిపేట, బండలబోరు, తదితర గ్రామాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని ఈ మూడు నెలల పాటు ఆశ్రయం పొందేందుకు వీలుగా తమ ఇళ్లలోని సామగ్రిని తరలిస్తున్నారు. గోదావరి వరదకారణంగా దారులు మూసుకుపోయే ప్రమాదం ఉన్న రుద్రమ్మకోట, రేపాక గొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నాళ్లవరం, చిగురుమామిడి గ్రామాల ప్రజలు కొన్ని రోజులుగా తమవస్తు సామగ్రితో పాటు సురక్షిత ప్రాంతాలకు తరలిపోతుండగా రుద్ర మ్మకోట, మట్టిగట్ల, చిగురుమామిడి, కోయిదా గ్రామాల ప్రజలు సమీపంలోని గుట్టల మీద గుడిసెలు ఏర్పాటు చేసుకుంటున్నారు. రానున్న మూడునెలలపాటు వీరికి కొండగుట్టలే ఆవా సం. రేపాకగొమ్ము గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు ఆదివారం పునరావాస కాలనీలకు ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా తమ ఇళ్ల లోని సామగ్రిని తరలించారు.

# చెరువులో పడి యువకుడి మృతి

తెర్లాం, (టుడే విదుర, జూన్ 30): మండలంలోని చినజనార్ధనవలనలో ఆదివారం బహిర్భుమికి వెళ్లిన గుళిపల్లి సత్యనారాయణ(31) మృతి చెందాడు. ఎస్ఐ సాగర్‌బాబు కథనం మేరకు.. సత్యనారాయణ ఉదయం బహిర్భుమికి వెళ్లాడు. నీళ్ల కోసం గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్లిన అతడు అక్కడ మూర్ఛ వ్యాధి వల్ల చెరువులో పడి మృతి చెందాడు. సత్యనారాయణ డిగ్రీ పూర్తి చేశారు. బొబ్బిలిలో గ్రోత్ సెంటర్‌లో మెకానిక్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. సత్యనారాయణకు తల్లిదండ్రులతో పాటు సోదరుడు ఉన్నారు. తల్లి దండ్రుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు.



# పైనాపిల్ ధర పతనం

సీతంపేట(టుడే విదుర, జూన్ 30): ఏజెన్సీలో గిరిజనుల సేకరించే అటవీ ఉత్పత్తుల్లో ఒకటైన పైనాపిల్ ధర ఒక్కసారిగా పడిపోయింది. గత వారం ఒక్కో పండు ధర రూ.15 పలకగా ప్రస్తుతం రూ.8కి చేరింది. దిగుబడులు పెరగడం, ఇటీవల కాలంలో జోరుగా వర్షాలు కురుస్తుండడంతో దాని రేటు ఒక్కసారిగా పతనమైంది. సీతంపేట వారపు సంతలో ఒక్కో పైనాపిల్‌ను రూ.8 చొప్పున విక్రయించారు. ఓ వైపు చిరుజల్లులు.. మరోవైపు భారీగా ధర తగ్గడంతో గిరిజన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను భద్రపరుచుకునేందుకు అవకాశం లేకపోవడంతో దళారులు చెప్పిన రేటుకే పంటను విక్రయిస్తూ తీవ్రంగా నష్టపో తున్నారు. మరోవైపు మైదాన ప్రాంత వ్యాపారులు కారుచౌకగా పైనాపిల్‌ను కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి పైనాపిల్‌కు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

# తోతాపురి నష్టాల్ని పూడ్చుతున్న టేబుల్ వెరైటీస్

చిత్తూరు, (టుడే విదుర, జూన్ 30): తోతాపురి రకం కాయల్ని గిట్టుబాటు ధరలేకపోవడంతో అమ్ముకోలేక ఇబ్బంది పడుతున్న మామిడి రైతులను రకాలుగా పేరుపడ్డ టేబుల్ వెరైటీస్ ఆదుకుంటున్నాయి. జిల్లాలో చాలామంది రైతులు తోతాపురితో నష్టాలు చవిచూసినా, రకాల కాయల్ని అమ్ముకుని నష్టాలను తగ్గించుకోగలుగుతున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు లక్ష ఎకరాల్లో తోతాపురి రకం సాగులో ఉండగా.. 40 వేల ఎకరాల్లో టేబుల్ వెరైటీస్ సాగులో ఉన్నాయి. ఈసారి కాపు బాగా రావడంతో తోతాపురి రకం 5 లక్షల టన్నులు, రకాల కాయలు లక్షన్నర టన్నులకుపైగా దిగుబడి ఉంటుందని అంచనా వేశారు. దిగుబడి బాగుందనుకుని సంతోషపడ్డ తోతాపురి ధర పతనం కావడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించి ఆదుకున్నా జ్యూస్ ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద కేజీ కాయలకు రూ.2నుంచి రూ.5వరకే రైతుకు దక్కుతోంది. కొన్నేళ్లుగా మామిడి ఉత్పత్తులకు డిమాండ్ లేకుండా పోయింది. దీంతో పల్ప్ నిల్వలు జ్యూస్ ఫ్యాక్టరీల్లో పెద్దఎత్తున మగ్గుతుండడంతో తోతాపురి రకాలకు డిమాండ్ లేకుండాపోయింది. ఇదే సమయంలో రకాల కాయలు సాగు చేసిన రైతులకు లాభాలు దక్కుతున్నాయి. తినడానికి, ఎగుమతులకు పనికొచ్చే ఈ కాయలు దిగుబడి తక్కువైనా మంచి ధర లభిస్తుండడంతో రైతులు సంతోషపడుతున్నారు. వీటికి కూడా సీజన్ దాదాపు పూర్తవుతుండడంతో మంచి ధరలు లభిస్తున్నాయి.

# జూలై రేషన్ ముందుగానే ...

## ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పంపిణీని ప్రారంభించిన డీలర్లు
## ప్రతినెలా ఇదే విధంగా రేషన్ అందజేత

జియ్యమ్మవలస, (టుడే విదుర, జూన్ 30): వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతినెలా 26వ తేదీ నుంచి 31 లోపు వారి ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులు అందించాలని ఆదేశాలు జారీ చేసింది. అంటే జూలైలో ఇవ్వాల్సిన నిత్యావసర సరుకులను ఈ నెలాఖరు నుంచే పంపిణీ చేస్తారు. దీనికి సంబంధించిన విధి విధానాలను ప్రభుత్వం కలెక్టర్ , సివిల్ సప్లైస్ డీఎంలు, జీసీసీ డీఎంలకు పూర్తిస్థాయిలో అందజేసింది. ఈ మేరకు జిల్లాలో యంత్రాంగం రంగంలోకి దిగింది. ఇప్పటికే డీలర్లు, సేల్స్‌మెన్‌లు ఆ పనిలో పడ్డారు. సర్కారు తాజా నిర్ణయంతో జిల్లాలో మొత్తం 40 వేల మందికి పైగా వృద్ధులు, దివ్యాంగులకు లబ్ధి చేకూరనుంది. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈనెల నుంచి రేషన్ డిపోల నుంచి సరుకుల పంపిణీ ప్రారంభించింది. తాజాగా వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి సరుకులు అందించాలని ఆదేశించడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – జిల్లాలోని 15 మండలాల్లో మొత్తంగా 578 రేషన్ షాపులు ఉన్నాయి. వాటి పరిధిలో 2,20,934 రైస్‌కార్డులు, 55,939 ఏఏవై కార్డులు ఉన్నాయి. ఇందులో 65 ఏళ్లు పైబడిన వృద్ధుల రేషన్‌కార్డులు 29,864 వరకూ ఉన్నాయి. అయితే ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ప్రతి నెలా ఒకటోతేదీ నుంచి డిపోల ద్వారా కార్డుదారులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేస్తున్నారు. 26వ తేదీ నుంచి నెలాఖరు వరకు 65 ఏళ్లు పైబడిన వారు, మంచంపై నుంచి కదల్లేని దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు అందజేయాల్సి ఉంది. ప్రస్తుతం డీలర్లు, సేల్స్‌మెన్‌లు పంపిణీని ప్రారంభించారు. – జిల్లా పరిధిలోని పాలకొండ డివిజన్‌లో పాలకొండ,



సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, కురుపాంలో ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. పార్వతీపురం డివిజన్‌లో పార్వతీపురం, మక్కువ, పాచిపెంట, సాలూరులో ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. పాలకొండ, పార్వతీపురం, మక్కువలో ఏఎంసీ గోడౌన్లు, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలూరు జీసీసీ గొడౌన్లు, సీతంపేటలో సివిల్ సప్లైస్ గొడౌన్, పాచిపెంట ప్రైవేట్ గోడౌన్‌లో ఈ ఎంఎల్ ఎస్ పాయింట్లు నడుస్తున్నాయి. పాలకొండ, సీతంపేట, పార్వతీపురం, మక్కువ, పాచిపెంట ఎంఎల్‌ఎస్ సివిల్ సప్లైస్ కంట్రోల్‌లో ఉండగా, సాలూరు, కురుపాం, గుమ్మలక్ష్మీపురంలు జీసీసీ కంట్రోల్‌లో ఉన్నాయి.

# గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో విజిలెన్స్ తనిఖీలు



చీమకుర్తి, (టుడే విదుర, జూన్ 30): ప్రకాశం జిల్లా చీమకుర్తి పరిసర ప్రాంతాల్లో విస్తరించిన గెలాక్సీ గ్రానైట్ క్వారీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి చెందిన సూర్యా గ్రానైట్ క్వారీలో డంపర్ బోల్తాపడిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో గ్రానైట్ క్వారీల్లో నిబంధనలు ఏ మేరకు పాటిస్తున్నారు.., కార్మికుల భద్రతపై తీసుకుంటున్న చర్యలు.., క్వారీయింగ్ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలను సమర్పించాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఆ మేరకు జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో వరుస రోడ్డు ప్రమాదాలు.. ఐదుగురు మృతి




అన్నమయ్య(టుడే విదుర, జూన్ 30): రోడ్డు ప్రమాదాల నివారణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగా అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఏదో ఒక ప్రాంతంలో యాక్సిడెంట్లు జరుగుతునే ఉన్నాయి. తమ గమ్యస్థానాలకు త్వరగా వెళ్లాలని కొంతమంది వాహనదారులు మీతిమిరిన వేగంతో వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆయా ఘటనల్లో పలువురు మృతిచెందుతుండటంతో బాధిత కుటుంబాలు తీవ్ర శోకంలో మునిగిపోతున్నాయి. తాజాగా అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లాలోని కురబలకోట మండలం దొమ్మన బావి వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. టెంపో ట్రావెలర్‌ని లారీ ఢీ కొట్టింది. దీంతో టెంపో ట్రావెలర్‌లో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మరో నలుగురిని మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్థంభించిపోయింది. ట్రాఫిక్‌ను పోలీస్ అధికారులు క్రమబద్ధీకరిస్తున్నారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందజేశారు. ఈ విషయం తెలియడంతో కన్నీరు మున్నీరుగా కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కారు నుంచి మంటలు

## సురక్షితంగా బయటపడిన కర్ణాటక భక్తులు



తిరుమల, (టుడే విదుర, జూన్ 30): తిరుమల జీఎన్సీ టోల్‌గేట్ వద్ద ఓ కారు అగ్నిప్రమాదానికి గురైంది. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా గుడిపల్లికి చెందిన సుదర్శన్ శ్రీవారి దర్శనం కోసం తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో తిరుమల బయలుదేరారు. మధ్యాహ్నం తిరుమలలోని జీఎన్సీ టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే కారు ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గుర్తించారు. వెంటనే అంతా వాహనం నుంచి కిందకు దిగి దూరంగా పరుగు తీశారు. నిమిషాల వ్యవధిలోనే కారు నుంచి మంటలు వ్యాపించాయి. టీటీడీ విజిలెన్స్, ఫైర్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు సగభాగం కాలిపోయింది.

# ప్రాణం తీసిన ఈత సరదా

## ఖ్యాతితేజ మృతదేహం
## గెడ్డలో మునిగి ఒకరి మృతి - మరొకరి పరిస్థితి విషమం



మాడుగుల (టుడే విదుర, జూన్ 30: : ఈత సరదా ఒక వ్యక్తి ప్రాణాలు బలిగొంది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మాడుగుల మండలం శివారు ఏజెన్సీ ముఖ ద్వారం గరికబంద సమీపాన బిల్లలపాలెం వద్ద తాచేరు గెడ్డలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన రంభ ఖ్యాతితేజ, ఆర్.కె.కౌశిల్, లెక్కల కుమారస్వామి, పైల బాలకృష్ణ, తాటికొండ సురేశ్‌లు స్నేహితులు. వీరిలో కుమారస్వామిది మాడుగుల స్వగ్రామం. ప్రస్తుతం విశాఖపట్నంలో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా ఈ ఐదుగురు స్నేహితులు మాడుగులలో ఓ శుభకార్యానికి ఆదివారం కారులో వచ్చారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత అక్కడ నుంచి బయల్దేరి పాడేరు, అరకు మీదుగా విశాఖపట్నానికి వెళదామని నిర్ణయించుకున్నారు. మాడుగుల నుంచి కారులో బయల్దేరి పాడేరు వెళుతుండగా ఏజెన్సీ ముఖద్వారం గరికబంద నుంచి పక్కగా లోపలికి సుమారు కిలోమీటరు దూరంలోని బిల్లలపాలెం వద్ద గల తాచేరు గెడ్డలో సరదాగా ఈత కొడదామని అక్కడికి వెళ్లారు. తాటికొండ సురేశ్ మినహా మిగిలిన నలుగురు(ఖ్యాతితేజ, కౌశల్, కుమారస్వామి, బాలకృష్ణ) తాచేరు గెడ్డలోకి దిగారు. కుమారస్వామి, బాలకృష్ణ ఒక దగ్గర, వీరికి కొంచెం దూరంలో కౌశల్, మరికొంత దూరంలో ఖ్యాతితేజ స్నానాలు చేస్తున్నారు. అయితే లోతు ఎక్కువగా, ఊబి ఉన్న ప్రాంతంలో ఖ్యాతితేజ మునిగిపోయాడు. కౌశల్ కూడా మునిగిపోతుండడాన్ని గమనించి కుమారస్వామి, బాలకృష్ణ రక్షించి ఒడ్డుకు లాక్కుని వచ్చారు. ఖ్యాతితేజను కూడా అతికష్టమ్మీద ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే ఖ్యాతితేజ నీరు ఎక్కువగా తాగేయడంతో స్పృహ కోల్పోయి అపస్మారక స్థితిలో ఉన్నాడు. చుట్టుపక్కల వారి సాయంతో ఖ్యాతితేజ, కౌశల్‌లను స్నేహితులు మాడుగుల ప్రభుత్వాస్పత్రికి తీసుకు వచ్చారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఖ్యాతితేజ(33) మృతి చెందినట్టు నిర్ధారించారు. కౌశిల్‌కి ప్రథమ చికిత్స చేస పరిస్థితి విషమంగా ఉండడంతో 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు ఖ్యాతితేజ విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు సమాచారం. కౌశల్ విశాఖపట్నంలో సీలింగ్ వర్క్ చేస్తుంటాడు. ఇతనికి కూడా వివాహమైంది. ప్రమాద విషయం తెలుసుకున్న మాడుగుల ఎస్‌ఐ నారాయణరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

# ఆయుర్వేదన!



## ఆయుర్వేద విభాగం
## ఏళ్ల తరబడి ఇంతే
## రోగుల ఇక్కట్లు

(రాజమహేంద్రవరం(టుడే విదుర, జూన్ 30): మందుల్లేని ఆసుపత్రి ఉంటుందా..ఎందుకు ఉం డ దు..రాజమహేంద్రవరంలో ఒక ఆసుపత్రి ఉంది.. ప్రైవే టు ఆసుపత్రి కాదండోయ్.. ప్రభుత్వ ఆసుపత్రే.. అయినా అధికారులకు పట్టదు..ప్రాంతీయ ఈఎస్ఐ ఆస్పత్రిలోని ఆయు ర్వేద విభాగానికి కాయ కల్ప చికిత్స తక్షణ అవసరంగా కనిపిస్తోం ది. ఏళ్ల తరబడి మందుల్లేవు.ఇండెంట్లు పెట్టడం.. వేచి చూడడం పరిపాటిగా మారిపోయింది.దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నా రు. ప్రస్తుతం ఆయుర్వేదం,హోమియో వైద్యానికి ఆదరణ పెరు గుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేదానికి ప్రాముఖ్యత ఇస్తోంది. కానీ ఈఎస్ఐ ప్రాంతీయ ఆస్పత్రిలోని పరిస్థితిని చూస్తే అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఆయుర్వేద వైద్య విభాగానికి ఒక సీనియర్ డాక్టరు మెడికల్ ఆఫీసర్‌గా ఉన్నారు. రోజుకు సుమారు 15 మంది రోగులు వైద్యానికి వస్తుంటారు. మందుల్లేకపోవడంతో రోగులకు సర్దిచెప్పి పంపడం తప్ప చేసేదేమీ ఉండడం లేదు.ఈ ఏరియా ఆస్పత్రిలో 2012లో ఆయుర్వేద విభాగాన్ని ఏర్పాటు చేశా రు. అప్ప ట్లో కావాల్సిన మందులను సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ (సీడీఎస్) యాప్‌లో నమోదు చేస్తే వాటిని ఆస్పత్రికి సరఫరా చేయడం జరి గేది.తర్వాత 2022 నుంచి మందుల సరఫరా నిలిచి పోయింది.యాప్ మారడంతో చిక్కులు వచ్చా యి. ఆయుర్వేద మందుల కంపెనీలు కొత్త యాప్‌లో లేకపోవడంతో చేసేదేమీ లేక పోతోంది.ఎట్టకేలకు 120 రకాల ఔష??దాలను యాప్‌లో పెట్టారు. వీటి కోసం గత సెప్టెంబరు నుంచి ఆస్పత్రి వైద్య లు ఇండెంట్ పెడుతూనే ఉన్నారు. ఈ రోజు వరకూ ఒక్క మందు బిళ్ల కూడా రాలేదు.ఇండెంట్ పెట్టిన తర్వాత 77 రోజుల వరకూ మళ్లీ ఇండెంట్ పెట్టడానికి వీల్లేదు. ఈ పరిస్థితుల్లో ఏళ్లు గడుస్తున్నా ఆయుర్వే వైద్య విభాగం పూర్తిస్థాయిలో అక్కరకు రావడం లేదు.ఆయుర్వేద మందులు ఖరీ దైనవి.ఈఎస్ఐ అంటే చిన్నస్థాయి కార్మికులు వైద్యం కోసం వస్తుంటారు.అంత సొమ్ములు వెచ్చించి కొనుక్కొనే పరిస్థితి ఉండదు.కానీ తప్పని పరిస్థితుల్లో బయటే కొనుక్కుంటున్నారు. ఏళ్ల తరబడి మందులు లేకపోయినా పట్టించుకునే వారే లేరా? అని రోగులు ప్రశ్నిస్తున్నారు.మూడు నెలల కిందట కార్మిక మంత్రి సు భాష్ ఈ ఆస్పత్రిపై తీవ్ర చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఏకంగా ఐదుగురు డాక్టర్లతో కలిపి 9 మందిని ఇంటికి పంపేశా రు.కానీ మందుల విషయం మాత్రం పట్టించుకోలేదు.దీంతో ఉచి తంగా వైద్యం పొందే హక్కు ఉన్న ఈఎస్ఐ సభ్యులకు ఖర్చు తప్ప డం లేదు.ఇప్పటికైనా పాలకులు మేల్కొని ఆయుర్వేద వైద్యాన్ని గాడిలో పెట్టడంపై దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు.

# తొలగని 'చెత్త' తలనొప్పి

- ♦ డంపింగ్ యార్డులోని లెగసీ వ్యర్థాలు
- ♦ డంపింగ్ యార్డులో పెరుగుతున్న వ్యర్థాలు
- ♦ కాలపరిమితి ముగియడంతో వెనుదిరిగిన కాంట్రాక్టర్లు
- ♦ ఫలించని టీటీడీ 'ఉచిత' నిర్వహణ యత్నం



తిరుమల, (టుడే విదుర, జూన్ 30): తిరుమల కొండపై చెత్త సమస్య సమసిపోలేదు. మళ్లీ వ్యర్థాలు గుట్టల్లా పోగవుతున్నాయి. కొండలా పేరుకుపోతున్న ఇక్కడి చెత్త తొలగింపుపై గతేడాది టీడీపీ ప్రత్యేక దృష్టి సారించింది. కొండ మీద రోజూ తడిచెత్త దాదాపు 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నుల వరకు సేకరించి గోగర్భం డ్యాం సమీపంలోని కాకులమాను దిబ్బ వద్ద డంప్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ తడిచెత్తను ప్రాసెస్ చేశాక కంపోస్టు తయారు చేసి మిగిలిన వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీ లేదా పవర్‌ప్రాజెక్ట్‌ల ప్రాంతాలకు పంపాలి. కానీ ఐదారేళ్లుగా ఈ ప్రక్రియ సరైన రీతిలో జరగలేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తడి, పొడిచెత్తలను వేరు చేసి తరలించడంలోనే విఫలమాయ్యారు. దీంతో కంపోస్టు కేంద్రంలో నిర్వహణ సరిగా జరగలేదు. ఫలితంగా కొండలను తలపించేలా వ్యర్థాలు చేరిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గతేడాది నవంబరులో ఈ సమస్య పరిష్కరించాలని సంకల్పించింది. అప్పటికే దాదాపు నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలున్నట్టు గుర్తించారు. ఆరు నెలల్లోపు క్లియర్ చేస్తామని ప్రకటించారు.

**వెనుతిరిగిన కాంట్రాక్టు సంస్థలు**

కొన్ని నెలల పాటు ఓ సంస్థ దాదాపు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను ప్రాసెస్ చేసి తొలగించింది. సవ్యంగా జరుగుతోందనుకునే లోపే సంస్థ కాంట్రాక్టు పూర్తయింది. కాంట్రాక్టును పొడిగించాలని ఆ సంస్థ కోరింది. టీటీడీ అంగీకరించలేదు. ఉచితంగా చేయాలని కోరింది. దీంతో ఆ సంస్థ వెళ్లిపోయినట్టు సమాచారం. తడిచెత్తను ప్రాసెస్ చేసే సంస్థ కాంట్రాక్టు కూడా ఈ ఏడాది మార్చికే పూర్తయింది. యంత్రాల మరమ్మతులు, కార్మిక సమస్యతో సరిగా నిర్వహించలేదంటూ ఆ సంస్థకు కూడా అనుమతికి నిరాకరించింది. పొడి వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మరో సంస్థకు ఎనిమిదేళ్ల పాటు అగ్రిమెంట్ ఉంది. ఈ సంస్థ కూడా సమర్థమంతంగా నిర్వహించడంలేదని టీటీడీ భావించింది. యంత్రాలతో చేయాలనే నిబంధన లేకపోవడంతో మాన్యువల్‌గానే ప్రాసెస్ చేస్తున్న క్రమంలో పొడిచెత్త ఎంతకూ తరగడం లేదు. దీంతో డంపింగ్ యార్డులో లెగసీ వ్యర్థాలు 50 వేల మెట్రిక్ టన్నులు, తడి వ్యర్థాలు 31,500 మెట్రిక్ టన్నులు, పొడి వ్యర్థాలు 4,800 మెట్రిక్ టన్నులు పేరుకుపోయాయి. తిరుమల పర్యావరణానికే ఈ వ్యర్థాల ద్వారా నష్టం వాటిల్లే అవకాశముందనే భయంతో టీటీడీ ఇటీవల రాజే ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ సంస్థను సలహాదారుగా నియమించింది. ఈ సంస్థ పలు సూచనలు చేసింది. వీలైనంత త్వరగా ఓపెన్ టెండర్లను పిలిచి తొలగించాలని, లేకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని పేర్కొంది. ఉచితం కోసం ఎదురు చూడాలా, సమర్థ సంస్థలకు టెండర్లు ఖరారు చేయాలా అని టీడీడీ తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలిసింది.

# ఇలా ఉంటే వ్యాధులు ప్రబలవా?



**మైదుకూరులో రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్త కుప్పల వద్ద సంచరిస్తున్న పందులు**

మైదుకూరు (టుడే విదుర, జూన్ 30): మురుగునీరు చెత్తకుప్పలు ఉంటే వ్యాధులు ప్రబలవా? అంటూ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు సీజనల్ వ్యాధులు సోకకుండా పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలంటూ అధికారులు పేర్కొంటున్నా అవి ఆచరణలో కొన్నిచోట్ల ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. నియోజకవర్గ కేంద్రమైన మైదుకూరు పట్టణంలో కొన్ని చోట్ల రోడ్డుపక్రనే చెత్తకుప్పలు పేరుకుపోయి వాటిలో పందులు తిరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ప్రస్తుతం వర్షాకా లం రావడంతో సీజనల్ వ్యాధులు ఇప్పుడిప్పుడే విజృభిస్తున్నాయి. మురుగు కాలువల్లో పూడికతీయకపోవడం, వీధుల్లో చెత్త చెదారాలు పే రుకుపోవడంతో దోమలు వ్యాప్తిచెంది రోగాలు విజృంభిస్తాయన్నారు. వ్యాధులు రాకముసు పే అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.మురుగునీటితో ఇబ్బందులు దువ్వూరు మండలం నీలాపురంగ్రామంలో మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ నడిబొడ్డున జనసంచారం కలిగిన ప్రదేశంలో ఉన్న మురుగునీటి కాలువలో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. కనీసం కాలువపైనే ఇనుప గరండాలు లేక సిమెంటు దిమ్మెలతో మూతవేస్తే కొంతలో కొతైనా సమస్యలు ఉండవని పలువురు పేర్కొంటున్నారు. నిత్యం జనరద్దీ ఉన్నచోటే మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సీజనల్ వ్యాధులు ప్రబలక ముందే తగు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆ ఇద్దరు..!

- ☛ తల్లి వంట చేస్తుండగా సామాన్లు శుభ్రం చేస్తున్న కూతురు
- ☛ ఐదేళ్లుగా చెట్టు కిందే నివాసం
- ☛ %కుమార్తెతో తల్లి దీనగాథకూతురు చదువు కోసం
- ☛ పరితపిస్తున్న చిన్న రంగమ్మ అనాథగా గ్రామ
- ☛ చివరన చెట్టు కిందే నివాసందీనస్థితిలో తల్లీ కూతురు



(టుడే విదుర, జూన్ 30): చిన్నరంగమ్మ... యాభై ఏళ్ల వితంతు మహిళ. ఉన్న ఒక్కగానొక్క కుమార్తె కీర్తిబాయిని సంరక్షించుకుంటూ ఓ గోడ చాటున జీవనం సాగిస్తోంది. ప్రతినెలా వచ్చే రూ.4వేలు వితంతు పింఛన్‌తో తనతో పాటు కుమార్తె కడుపు నింపుకుంటోంది. పనిచేసే సత్తువ లేదు. పోనీ ఉందా మంటే సెంటు జాగా లేదు. ఇన్నాళ్లూ కుమార్తెను హాస్టళ్లలో ఉంచి చదివించిన ఆమెకు ఇప్పుడు పెద్ద కష్టం వచ్చిపడింది. వయసుకొచ్చిన బిడ్డ ఇప్పుడు తనతో పాటు దయనీయ జీవితం గడపాల్సి వస్తోందంటూ కన్నీరు సుడులు తిరుగుతుండగా ఆమె చెప్పింది. కీర్తిబాయి.. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన యువతి. ఈ వయసులో మంచి చదువుతో పాటు స్నేహితులతో సరదాగా ఉండాలని, మంచి డ్రస్సులు వేసుకోవాలని, సంతోషంగా ఉండాలని ఎవరికైనా ఉంటుంది. ఉన్నంతలో సమాజంలో బాగా కనిపించాలనే తపన ఉంటుంది. కానీ ఈ యువతి పరిస్థితి ఇందుకు పూర్తి విభిన్నం. నిలువ నీడ లేదు, వసతి లేదు.. తల్లితో కలసి పడరాని పాట్లు పడుతోంది. పేరులో కీర్తిని దాచుకున్న ఈమెకు నిజ జీవితంలో ఎలాంటి సౌకర్యాలు లేకుండా పోయాయి.ఇల్లు లేదు. ఎండ వస్తే చెట్టునీడలో.. వానొస్తే దయతో పక్కింటి వాళ్లు అవకాశం ఇస్తే వారి వసారాలో తలదాచుకోవాల్సిందే. భర్తలేక ఆమె.. తండ్రి లేక యువతి ఒకరినొకరు చూసుకుంటూ గూడు చెదిరిన పక్షుల్లా ఉన్నారు. యుక్త వయస్సులో ఉన్న కీర్తిబాయి, పనిచేసే సత్తువ లేని చిన్నరంగమ్మ ఇద్దరి దీనావస్థను చూస్తే ఎంతటి వారికైనా కన్నీరు రాకమానదు. స్నానం చేయాలంటే ఓ టార్పాల్ పట్టను అడ్డుపెట్టుకోవాలి.. మరుగుదొడ్డికి పోవాలంటే ఊరి బయటకు వెళ్లాల్సిందే. అది చేస్తాం.. ఇది చేశామంటూ గొప్పలు చెప్పే రాజకీయ నేతలు... పేదరికం లేని సమాజమే లక్ష్యం అంటూ ఏసీ గదుల్లో కూర్చొని ప్రకటనలు చేసే అధికారులు... ఓసారి మంత్రాలయం మండలంలోని మాధవరం తండాకు రండి. ఈ గిరిజన బిడ్డల దయనీయ స్థితిని గమనించండి.

# లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయాలి


ఒంగోలు (టుడే విదుర, జూన్ 30): లోగ్రేడ్ పొగాకును క్వింటాను రూ.20వే లకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో జయంతి బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వర్జీని యా పొగాకు ధరలు రోజురోజుకు పడిపోతు న్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చే సుకొని పొగాకు రైతులను ఆదుకోవాలని డి మాండ్ చేశారు. కంపెనీలు లోగ్రేడ్‌ను కొనుగో లు చేయకుండా మేలు రకం పొగాకును మా త్రమే కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం జోక్యం చేసు కుని రైతులను ఆదుకోవాలని కోరారు.

# నాలుగు నెలలుగా తాగునీటి సమస్య



రాయదుర్గం(టుడే విదుర, జూన్ 30): తాము నాలుగు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ మహిళలు వాపోయారు. ఈ మేరకు వారు శనివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఆరునెలల కితం శ్రీరామిరెడ్డి పథకం నీరు వచ్చేవని, నాలుగు నెలల నుంచి పంచాయతీ బోర్ నుంచి సక్రమంగా ఇవ్వకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తాగునీటి కోసం రాత్రి 12 గంటల సమయంలో బిందెలు పట్టుకొని.. వ్యవసాయ పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోందన్నారు. తప్పనిపరిస్థితుల్లో ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ. 10 నుంచి రూ. 15లకు బిందె, క్యాన్లతో నీరు కొనుగోలు చేసుకుని తాగుతున్నట్లు తెలిపారు. మొహరం పండుగ వస్తోందని, అధికారులు ఇప్పటికైనా స్పందించాలని శాంతమ్మ, కమలాక్షి, కొల్లమ్మ, రుద్రమ్మ తదితరులు విజ్ఞప్తి చేశారు.

# కొమ్మంగి బ్రిడ్జి వద్ద ఆటో బోల్తా



చింతపల్లి, (టుడే విదుర, జూన్ 30): మండలంలోని కొమ్మంగి బ్రిడ్జి వద్ద సర్వీసు ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో పది మంది ప్రయాణికులు గాయపడగా, నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా వుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కుదుపుసింగి గ్రామానికి చెందిన సర్వీసు ఆటోలో కొమ్మంగి నుంచి కొంత మంది ప్రయాణికులు చింతపల్లి వస్తున్నారు. కొమ్మంగి బ్రిడ్జి వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న పది మంది గాయపడ్డారు. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో అంబులెన్సులో క్షతగాత్రులను చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. తీవ్రంగా గాయపడిన కుడుముల జానకమ్మ, దేవకుమారి, చంద్రమ్మ, పెద్దమ్మలకు స్థానిక వైద్యులు ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో ఆరుగురు స్వల్పగాయాలతో చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



# ఎల్లెల్సీకి ముందస్తు సాగునీరు

**ఉప్పొంగుతున్న తుంగభద్రమ్మ**

**పనులు పూర్తి చేయాలని బోర్డు అధికారుల ఆదేశం**

హాలహర్వి,(టుడే విదుర, జూన్ 30): తుంగభద్ర జలాశయం నీటి నిల్వ 62 టీఎంసీలు దాటిపోయింది. వరద ఉధృతి 63,816 క్యూసెక్కులు. మరో రెండు రోజుల్లో 80 టీఎంసీలకు నీటి నిల్వ చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జలాశయంలో 80 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేసుకుని, మిగతా వరద నీటిని నదికి విడుదల చేసేందుకు బోర్డు అధికారులు సిద్ధమయ్యారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు ఈ యేడాది మే నెలలోనే ఇన్‌ఫ్లో ప్రారంభం కావడంతో జూన్ ఆఖరికి పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరబోతుంది. కానీ క్రస్ట్‌గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో జలాశయం నీటి నిల్వ 80 టీఎంసీలకు మించకూడదనే బోర్డు అధికారుల నిర్ణయంతో ఈసారి ముందస్తుగానే కాలువకు నీరు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు కర్ణాటక రాష్ట్ర జలవనరుల మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ఏఐసీసీ సమావేశంలో నిర్ణయించారు. కర్నూలు జిల్లాలో 1.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఎల్లెల్సీ కాలువకు ముందస్తుగా సాగునీరు అందుతుంది. ముందస్తుగా సాగునీరు విడుదలవుతున్న నేపథ్యంలో సీసీ లైనింగ్ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లపై బోర్డు అధికారులు ఒత్తిడి పెంచారు. దీంతో పనులు వేగవంతం అవుతున్నాయి. తుంగభద్ర జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు ఉండగా, ప్రస్తుతం 1622 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 63,816 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా అవుట్ ఫ్లో 200 క్యూసెక్కులుగా ఉంది.

# ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కోకో గింజల కొనుగోలు

## కిలోకు రూ.500 చెల్లిస్తున్న కంపెనీలు



అమరావతి, (టుడే విదుర, జూన్ 30): రాష్ట్రంలో కోకో రైతుల సమస్య దాదాపు పరిష్కారమైంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పలు కంపెనీలు కోకో గింజలు కొనుగోలు చేస్తున్నాయి. కిలోకు రూ.500 చొప్పున కంపెనీలు రైతులకు చెల్లిస్తే.. అందులో రూ.50 సదరు కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోంది. ఈ ఏడాది కోకో ధరలు పడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని, కనీస మద్దతు ధరను నిర్ణయించింది. అయినా అన్ని కంపెనీలు, వ్యాపారులు కోకో గింజల కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో సీఎం చంద్రబాబు ధరలపై సమీక్ష జరిపారు. సేకరణ ధరలో కిలోకి రూ.50 ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. మంత్రి అచ్చెన్నాయుడు పలు దఫాలు చర్చలు జరిపి మాండలీజ్, డీపీ చాకొలెట్స్ వంటి కంపెనీలను ఈ మేరకు ఒప్పించారు. దీంతో ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, కాకినాడ, మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 3,394 మంది రైతుల నుంచి 2,228 టన్నుల కోకో గింజలను కొనుగోలు చేయగా.. ఇందుకోసం ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

# వీధిలైట్లు ఆపి నిరసన



రాజీవ్‌గాంధీ రోడ్డులో వెలగని వీధి లైట్లు

చిత్తూరు (టుడే విదుర, జూన్ 30): చిత్తూరు నగరపాలకసంస్థలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న కార్మికులు నగరంలో విద్యుత్ సరఫరాను ఆపివేసి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ వారం రోజులుగా చిత్తూరు నగరపాలక కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో సాయంత్రం చిత్తూరు నగరంలోని వీధి లైట్లను ఆపివేశారు. దీంతో వీధుల్లో అంధకారం నెలకొని జనం ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం స్పందించకపోతే సోమవారం నుంచి నీటిసరఫరాను కూడా ఆపివేస్తామని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి హెచ్చరించారు.

# కడపలో ఓ యువకుడు యువతిని బెదిరించి...



(టుడే విదుర, జూన్ 30): మహిళల రోజు రోజుకు అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయి. చిన్నారుల నుంచి పండు ముసలి వరకు మృగాళ్లు మహిళలపై లైంగిక దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వం పోలీసులు మహిళా భద్రతకు పెద్దపీట వేస్తున్నా.. షీటీమ్స్ ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ పోకిరీల భరతం పడుతున్నా.. అరాచకాలు, అత్యాచారాలు మాత్రం తగ్గడంలేదు. చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయి.భారతదేశంలో 79వ ఇండిపెండెన్స్ డే వచ్చినా ఇంకా మహిళలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం రాలేదు. ఒంటరి మహిళలమీద అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయి. రేపిస్టులు, హంతకులు ఏమాత్రం భయపడకుండా దారుణాలకు తెగబడుతున్నారు. దేశంలో నిర్భయ కాండలు జరుగుతూనే ఉన్నాయి.తాజాగా కడప జిల్లా, దువ్వూరు మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతిపై వేణు అనే యువకుడు ఆమెను బెదిరించి అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై బాధితురాలు ఆలస్యంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేసి వేణుతో పాటు కార్తీక్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# వెల్ఫేర్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్



చిత్తూరు (టుడే విదుర, జూన్ 30): జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. చిత్తూరు అంబేద్కర్ భవన్‌లో సాంఘిక సంక్షేమశాఖ డీడీ విక్రమ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఐదేళ్ళు పూర్తయిన వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది. మొదట విభిన్న ప్రతిభావంతులకు, స్పౌజ్ కేటగిరీ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థుల నుంచి ముందుగా తీసుకున్న ఆప్షన్లు, ఖాళీల ఆధారంగా సీనియారిటీ ప్రకారం కోరుకునే అవకాశాన్ని కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 485 పోస్టులకు 355 మందికి బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించినట్లు డీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో అన్ని పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. సూపరింటెండెంట్లు మురుగేశ్, మురళి, సూర్యప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, సిబ్బంది పవన్, ధనశేఖర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ భవన్‌లో జరిగిన బదిలీ కౌన్సెలింగ్ వచ్చిన వెల్ఫేర్ అసిస్టెంట్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చిత్తూరు ఏఎసడబ్ల్యూవోను ప్రభుత్వానికి సరెండర్ చేస్తామని డీడీ తెలిపారు. అవసరమైన కుర్చీలు, తాగునీరు, మైక్ వసతి ఏర్పాటు చేయకపోవడంతో ఏఎసడబ్ల్యూవో, చిత్తూరు యూనిట్ వార్డెన్లపై ఆయన మండిపడ్డారు. కాగా, కౌన్సెలింగ్ ప్రారంభమైన రెండు గంటలకు వెల్ఫేర్ అసిస్టెంట్లకు కుర్చీలను ఏర్పాటు చేశారు.

# విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో చోరీకి యత్నం..




(టుడే విదుర, జూన్ 30): విశాఖ ఎక్స్‌ప్రెస్ లో దుండగులు భారీ దొంగతనానికి ప్రయత్నించారు . దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందారు. ఈ విషయం తెలుసుకుని.. వెంటనే అప్రమత్తమైన రైల్వే పోలీసులు జూశీ దుండగుల్ని కట్టడి చేసేందుకు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. దీంతో భయపడిన దుండగులు రైల్లో నుంచి దూకి పారిపోయారు. పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలం, తుమ్మల చెరువు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది.కాగా పిడుగురాళ్ల సమీపంలో బీహార్, మహారాష్ట్ర గ్యాంగ్‌లు వరుసగా రైళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ముఠాలో ఏడుగురు సభ్యులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తెల్లవారుజామున చోరీకి పాల్పడటంతో రైల్వే పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గుర్తు తెలియని దుండగులు రైలులోని పలు కోచ్‌లను లక్ష్యంగా చేసుకొని చోరీకి యత్నించారు. విశాఖ ఎక్స్‌ప్రెస్. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తుండగా, ఈ దుండగులు రైలులోకి చొరబడి ప్రయాణికుల సొమ్మును దొంగిలించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.రైల్వే పోలీసులు సకాలంలో స్పందించి, దుండగులను అడ్డుకోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. లేకపోతే భారీ చోరీ జరిగేదని ప్రయాణికులు వాపోయారు. అయితే రైల్వే పోలీసులు జరిపిన కాల్పుల్లో ఎవరూ గాయపడలేదు. దుండగులు చీకటిలో రైల్లో నుంచి దూకి తప్పించుకున్నారు. దుండగులు రైలులోని ఐదు కోచ్‌లను టార్గెట్ చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. కాగా వారం రోజుల వ్యవధిలో రైళ్లలో రెండు సార్లు దొంగతనాలు జరిగాయి.

# సోలార్ హబ్ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగు

సోలార్ హబ్ ఏర్పాటుపై రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావాలి

%సమావేశంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు



బల్లికురవ, (టుడే విదుర, జూన్ 30): ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తుందని దీంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీ శివారు సుజాత నగర్ వద్ద ఆర్డీవో సోలార్ హబ్ ఏర్పాటుకు భూసేకరణ చేసేందుకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం గ్రామాలకు చెందిన పలువురు రైతుల వద్దసుమారు 390 ఎకరాల భూములు సోలార్ హబ్‌కు అవసరమని,రైతులు ముందుకు వచ్చి ఇస్తే పరిశ్రమ ఏర్పాటు అవుతుందని అన్నారు. ప్రభుత్వం భూములకు ఉన్న విలువ కంటే రెండున్నర రెట్ల అధికంగా రైతులకు నగదు అందజేస్తుందన్నారు. రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తే కలెక్టర్ వద్ద సమావేశం ఏర్పాటు చేసి వారికి స్పష్టమైన వివరణ ఇస్తామన్నారు. సోలార్ హబ్ ఏర్పాటు చేస్తే గ్రామాలలో ఉన్న భూములకు కూడా విలువ పెరుగుతుందని, గ్రామాలుకూడా అభివృద్ధి చెందుతాయని అన్నారు. అనంతరం సంతమాగులూరు మండలంలోని మామిళ్లపల్లి, కుందుర్తి గ్రామాలలో కూడా సోలార్ హబ్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణపై ఆర్డీవో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు రవినాయక్, రవిబాబు, డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్, ఆర్ఐ పోతురాజు, వీఆర్వో యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# టమోటా ధరలపై రైతుల ఆశలు

పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమోటాలు



పలమనేరు,(టుడే విదుర, జూన్ 30): టమోటా ధరలపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. గత 8 నెలలుగా టమోటా ధరలు గణనీయంగా పడిపోయాయి. సాధారణంగా ఏప్రిల్, మే మాసాల్లో తప్పక టమోటా ధరలు పెరుగుతుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. అయితే జూన్ 15 వరకు టమోటా కిలో రూ.10 వరకు పలుకుతుండేది. అయితే ఆ ధరలు పెరుగుతూ వచ్చాయి. గత ఆరు రోజులుగా టమోటా ధరలు కొంత నిలకడగానే పలుకుతున్నాయి. ఈనెల 23న పలమనేరు మార్కెట్లో కిలో కనీస ధర రూ.13.70, గరిష్ట ధర రూ.24.70, 24న టమోటా కిలో కనిష్ట ధర రూ.21.60 , గరిష్ట ధర రూ. 24.70, 25న టమోటా కిలో కనిష్ట ధర రూ.17, గరిష్ట ధర రూ.23, 26న టమోటా కిలో కనిష్ట ధర రూ.16, గరిష్ట ధర రూ.20, 27న టమోటా కిలో కనిష్ట ధర రూ.17.80, గరిష్ట ధర రూ.21, శనివారం టమోటా కిలో కనిష్ట ధర రూ.17.70, గరిష్ట ధర కిలో రూ.21.50 పలికాయి. 15 కిలోల టమోటా బాక్సు ధర రూ.300లకు చేరుకుంది. అయితే మళ్లీ ఇప్పుడు వర్షాలు కురిస్తే తోటల్లోనే టమోటాలు మాగిపోయి మార్కెట్ కు పెద్ద ఎత్తున తీసుకొస్తే మాత్రం మళ్లీ బాక్సు టమోటాల ధరలు రూ.150 లకు పడిపోయే ప్రమాదం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. వారం క్రితం వరకు పలమనేరు మార్కెట్‌యార్డుకు 400 మెట్రిక్ టన్నులకు పైగా రోజూ టమోటాలు వస్తుండగా.. గత మూడు రోజులుగా తక్కువగా వస్తున్నాయి. పలమనేరు మార్కెట్‌కు 380 టన్నుల టమోటాలను రైతులు విక్రయించేందుకు తీసుకొచ్చారు.

# టుడే వినోదం




## భారతీయ సినీరంగం గర్వించే విషయం




హీరో కమల్ హాసన్ ఆస్కార్ కమిటీలో సభ్యుడిగా ఎంపికవ్వడంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది భారతీయ సినీరంగం గర్వించే విషయమని ప్రశంసించారు. "ప్రపంచమంతా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆస్కార్ అవార్డుల కమిటీలో సభ్యుడిగా పద్మభూషణ్ కమల్ హాసన్ ఎంపికవ్వడం భారతీయ సినీరంగం గర్వించదగ్గ విషయం. ఆరు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో ఆయన నటుడిగా, దర్శకుడిగా, కథకుడిగా భారతీయ, ప్రపంచ సినిమాపై చెరగని ముద్ర వేశారు. సినిమా మేకింగ్ విషయంలో ఆయనకు ఉన్న పట్టు స్ఫూర్తిదాయకం. ప్రపంచ సినిమాకు ఆయన ఇలాగే మరింత కాలం సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అని పేర్కొన్నారు. కాగా, 'ది అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' ఇటీవల విడుదల చేసిన కొత్త కమిటీ సభ్యుల జాబితాలో భారత్ నుంచి కమల్ హాసన్‌తో పాటు నటుడు ఆయుష్మాన్ ఖురానా, దర్శకురాలు పాయల్ కపాడియా, ఫ్యాషన్ డిజైనర్ మాక్సిమా బసు ఉన్నారు. హాలీవుడ్ నటీనటులతో పాటు ఆస్కార్ ఓటింగ్ ప్రక్రియలో వీరు పాలుపంచుకోనున్నారు.

## శింబు మానాడు-2.. కాంబినేషన్ రిపీట్!




హీరో శింబు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో నాలుగేండ్ల క్రితం వచ్చి సంచలన విజయం సాధించిన చిత్రం మానాడూ హాలీవుడ్ స్టార్ టామ్ క్రూజ్ నటించిన ఎడ్జ్ ఆఫ్ టుమారో తరహా టైమ్ లూప్ కథ నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీ కరోనా తమిళ ప్రేక్షకులను ఓ ఊపు ఊపింది.ఆపై తెలుగులోనూ ఓటీటీ ద్వారా ఇక్కడి ప్రేక్షకులకు చేరువైంది. ఈ చిత్రం వచ్చి నాలుగేండ్లు పూర్తైనా ఇప్పటికీ ఈ సినిమాలోని ఎస్జే సూర్య చెప్పే వచ్చాడు కాల్చాడు చచ్చాడు రిపీట్ డైలాగ్ చాలా ప్రాంతాలలో విరివిగా వినిపిస్తూ ఉంటుందంటే ఈ సినిమా జనాలలోకి ఎంతలా వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. %అయితే ఇప్పుడు ఈ మూవీకి సీక్వెల్ తీయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా కోసం హీరో శింబు, దర్శకుడు వెంకట్ ప్రభు మరోసారి జత కట్టబోతున్నారు. ఈ సినిమాకు దసుమారు దశాబ్దంకి పైగా హిట్ లేక కెరీర్ ఎండ్ కార్డ్ పడుతున్న సమయంలో హీరో శింబు కు ఈ చిత్రం ఓ అమృతంలా ఆదుకోవడమే కాక అప్పటి వరకు శింబుకు ఉన్న స్టేటస్‌ను రెండింతలు రెట్టింపు చేసి అగ్ర స్థానంలో నిలిపింది. దీంతో ఇప్పుడు ఈ సీక్వెల్‌పై అంచనాలు క్రమంగా ప్రారంభమయ్యాయి. అయితే.. ప్రస్తుతం శింబు వెంకట్ ప్రభు ఇద్దరు వరుస సినిమాలతో బిజీగా ఉన్న నేపథ్యంలో ఆ చిత్రాలు పూర్తి చేసిన అనంతరం తిరిగి ఈ సినిమాను పట్టాలెక్కించనున్నారు. తొలిభాగం నిర్మించిన నిర్మాత సురేష్ కామాక్షి ఈ సీక్వెల్‌ను సైతం నిర్మించనుండగా మిగతా నటీనటులు, టెక్నీషియన్ల వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు. ఇదిలాఉంటే ప్రస్తుతం ఈ మానాడు మొదటి చిత్రం తమిళంతో పాటు తెలుగు ఇతర భాషల్లో సోనీ లివ్ ఓటీటీలో అందుబాటులో ఉంది.

## నాగ చైతన్యకు ఐదు కథలు చెప్పా.. కానీ




టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. హీరోగా కెరీర్ ను మొదలుపెట్టిన వెంకీ.. తొలిప్రేమ సినిమాతో డైరెక్టర్ గా మారిన వెంకీ అట్లూరి.. మొదటి సినిమాతోనే భారీ విజయాన్నిఅందుకున్నాడు. ఇక ఈ సినిమా తరువాత వెంకీ నాలుగు సినిమాలు తెరకెక్కించాడు. మిస్టర్ మజ్ను, రంగ్ దే, సార్, లక్కీ భాస్కర్ సినిమాలతో ఇండస్ట్రీలో తనకంటూ ఒక మంచి పేరును తెచ్చుకున్నాడు. ముఖ్యంగా సార్, లక్కీ భాస్కర్ సినిమాలతో వంద కోట్ల క్లబ్ లో చేరాడు. %ఇక ప్రస్తుతం వెంకీ.. సూర్యతో ఒక సినిమాను తెరకెక్కిస్తున్నాడు. సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమా ఈమధ్యనే పూజా కార్యక్రమాలను పూర్తిచేసుకొని సెట్స్ మీదకు వెళ్ళింది. ఇక సూర్య సినిమా తరువాత వెంకీ .. నాగ చైతన్యతో ఒక సినిమా చేస్తున్నట్లు టాక్ నడుస్తోంది. ఇక తాజాగా వెంకీ అట్లూరి ఒక ఇంటర్వ్యూలో నాగ చైతన్య గురించి చెప్పుకొచ్చాడు.

## ఈ నగరానికి ఏమైంది2.. మొదలు పెట్టారు




సరిగ్గా ఏడేండ్ల క్రితం అనామకంగా ప్రేక్షకుల ముందుకు వచ్చి తెలుగు యూత్‌ని ఉర్రుతలూగించిన కల్ట్ క్లాసిక్ సినిమా ఈ నగరానికి ఏమైంది. పెళ్లి చూపులు వంటి మంచి హిట్ తర్వాత తరుణ్ భాస్కర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. అయితే థియేటర్‌లో కాస్త నిరాశ పర్చిన ఈ మూవీ ఆ తర్వాత ఓటీటీకి వచ్చి కల్ట్ కాస్లిక్ గుర్తింపును తెచ్చుకుంది. ఆపై దఫాదఫాలుగా రీ రిలీజ్ అయి భారీ వసూళ్లు సాధించాయి. యూత్‌లో సెన్సేషనల్ క్రేజ్ ఉన్న ఈ సినిమా ఇప్పటికీ ఏదో ఒక సమయంలో ట్రెండింగ్‌లోనే ఉంటుంది. %అయితే ఈ మూవీ టీమ్ నుంచి వచ్చిన ఒక సెన్సేషనల్ అప్డేట్ ప్రస్తుతం యూత్‌ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సినిమాకు కొనసాగింపుగా సెకండ్ పార్ట్ త్వరలో ఉంటుందని ప్రకటిస్తూ వచ్చిన మేకర్స్ ఇప్పుడు ఆ వార్తలను నిజం చేశారు. తాజాగా ఆదివారం ఈ మూవీకి సంబంధించి కీలక అప్డేట్ ఇస్తూ ఈ నగరానికి ఏమైంది రీపీట్ అనే పేరుతో సినిమాను ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ ఓ చిన్న వీడియోను, పోస్టర్‌ను రిలీజ్ చేశారు. మేకర్స్ నుంచి వచ్చిన ఈ అప్డేట్‌తో ఫాన్స్ ఫుల్ జోష్‌లో ఉన్నారు.

## మీ కాళ్లు పట్టుకుంటా ఆదుకోండి.. కన్నీళ్లు పెట్టిస్తున్న సీనియర్ నటి వీడియో




ఇప్పుడంటే స్టార్ హీరోయిన్లు, నటీమణులు దీపం ఉండగానే ఇల్లు చక్కెబెట్టుకుంటున్నారు. ఎందుకంటే అవకాశాలు రానప్పుడు, చివరి అంకంలో ఒకరి మీద ఆధారపడకుండా ఉండడానికి తెలివిగా ఆలోచిస్తూ వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టుకోవడం, వేరే వేరే వ్యాపారాలు చేయడం చేస్తున్నారు. కానీ, అప్పట్లో నటీమణులకు అంత తెలివి లేదు. అందుకే ఇప్పుడు చాలామంది నటీమణులు డబ్బు లేక ఇబ్బంది పడుతున్నారు. అలాంటి నటీమణుల్లో పాకీజా ఒకరు. పాకీజా.. ఇప్పటి జనరేషన్ కు ఆమె ఎవరో తెలియకపోవచ్చు. కానీ, ఒకప్పుడు ఆమె నటనకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉందనే చెప్పొచ్చు. %1986 లో ఎన్ ఊయిర్ కన్నమ్మ అనే సినిమాతో పాకీజా ఇండస్ట్రీకి పరిచయమైంది. లేడీ కమెడియన్ గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. ఇక తెలుగులో ఆమెను మోహన్ బాబు పరిచయం చేశాడు. బ్రహ్మానందం - కోవై సరళ జంట అంటే ప్రేక్షకులకు ఎంత ఇష్టమో అందరికీ తెల్సిందే. కానీ, కోవై సరళ కన్నా ముందే బ్రహ్మానందంతో మంచి పెయిర్ అనిపించుకున్న నాటికి పాకీజా. రౌడీ గారి పెళ్లాం, మామగారు, రౌడీ ఇన్స్పెక్టర్, చిట్టెమ్మ మొగుడు, పెదరాయుడు లాంటి సినిమాలతో మంచి గుర్తింపును అందుకుంది.

## బిగ్‌బాస్ 9.. చదరంగం కాదు.. రణరంగం




అక్కినేని నాగార్జున హోస్ట్‌గా వ్యవహరిస్తున్న రియాల్టీ షో 'బిగ్‌బాస్' ఇప్పటికి 8 సీజన్లు పూర్తి చేసుకుంది. ఇప్పుడు మరో సీజన్‌తో అలరించడానికి రెడీ అవుతోంది. 'ఆటలో అలుపు వచ్చినంత సులువుగా గెలుపు రాదు. ఆ గెలుపు రావాలంటే, యుద్ధం చేస్తే సరిపోదు. ప్రభంజనం సృష్టించాలి. ఈసారి చదరంగం కాదు. రణరంగమే' అంటూ నాగార్జున సీజన్9ను పరిచయం చేశారు. అంతేకాదు మరో ఆసక్తికర అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఈ సారి షోలోకి సామాన్యులను సైతం ఆహ్వానిస్తున్నారు. %"ఇప్పటివరకూ మీరు బిగ్‌బాస్ షోను ఎంతో ప్రేమించారు. ఇంత ప్రేమను ఇచ్చిన మీకు.. రిటర్న్ గిఫ్ట్‌గా ఏమివ్వాలి? మీరు ఎంతగానో ప్రేమించిన బిగ్‌బాస్ హౌస్‌లోకి ఎంట్రీయే రిటర్న్ గిఫ్ట్. ఈ సారి హౌస్‌లోకి సెలబ్రిటీలే కాదు. సామాన్యులకు అవకాశం ఉంది. వచ్చేయండి" అని నాగార్జున పేర్కొన్నారు. దీని కోసం ఏం చేయాలంటే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయి, బిగ్‌బాస్9లో పాల్గొనడానికి కారణం చెబుతూ వీడియోను అప్‌లోడ్ చేస్తే, షరతుల మేరకు హౌస్‌మేట్ అయ్యే ఛాన్స్ లభించవచ్చని జియో హాట్‌స్టార్ తెలిపింది.అయితే ఈ సీజన్‌కు వ్యాఖ్యతగా నాగార్జున మారతారని, బాలకృష్ణ షోని హోస్ట్ చేసే అవకాశం ఉందని చర్చలు నడిచాయి. అయితే ఇప్పుడు వదిలిన ప్రోమోతో నాగార్జునే ఈ సారి కూడా వ్యాఖ్యతగా వ్యవహరించనున్నారని తెలిసిపోయింది.

టుడే స్పోర్ట్స్

# సెమీస్ లో నిఖత్



జాతీయ ఎలీట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్‌తో సహా ముగ్గురు తెలంగాణ బాక్సర్లు సెమీఫైనల్లోకి ప్రవేశించారు. ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన రెండో రోజు పోటీల్లో 48-51 కిలోల విభాగంలో నిఖత్ 5-0తో కల్పన (సాయ్)పై తిరుగులేని విజయం సాధించి పతకానికి చేరువైంది. 57-60 కి., కేటగిరీలో జి. నిహారిక 5-0తో ప్రియాంక (చండీగఢ్)పై, 60-65 కి., విభాగంలో యషి శర్మ 3-2తో సరిత రాయ్ (ఉత్తరప్రదేశ్)పై నెగ్గి సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నారు. 45-48 కి., మంజు రాణి, 70-75 కి., లవ్లీనా తమ బౌట్లలో గెలిచి, ముందంజ వేశారు.

# టీమిండియా కోసం ఇంగ్లండ్ లెజెండ్.. సొంతజట్టుకు వ్యతిరేకంగా ప్లాన్!




ఇంగ్లండ్ పర్యటనను పరాభవంతో మొదలుపెట్టిన టీమిండియా.. ఇప్పుడు ప్రతీకారంతో రగిలిపోతోంది. లీడ్స్ టెస్టులో ఓటమి గిల్ సేనను నిరాశలో ముంచేసింది. అయితే వెంటనే తేరుకొని ప్రాక్టీస్ మొదలుపెట్టిన భారత జట్టు.. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే రెండో టెస్ట్ కోసం జోరుగా సన్నద్ధమవుతోంది. స్టోక్స్ సేన బెండు తీసి సిరీస్‌ను 1-1తో సమం చేయాలని చూస్తోంది. ఈ తరుణంలో మెన్ ఇన్ బ్లూకు అండగా నిలబడుతున్నాడో ఇంగ్లండ్ స్టార్. సొంతజట్టుకు వ్యతిరేకంగా, గిల్ సేనకు అనుకూలంగా పని చేస్తున్నాడు. అతడు ఎవరనేది ఇప్పుడు చూద్దాం..భారత జట్టు ఆటగాళ్లకు సాయం చేస్తున్నాడు ఇంగ్లండ్ దిగ్గజం కెవిన్ పీటర్సన్. స్పిన్నర్లకు అంతగా అచ్చిరాని ఇంగ్లీష్ కండీషన్స్‌లో వికెట్లు ఎలా తీయాలో నేర్పిస్తున్నాడు. ఈ విషయాన్ని స్వయంగా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ బయటపెట్టాడు. 'కెవిన్ పీటర్సన్ నాకు కొన్ని సలహాలు ఇచ్చాడు. ఇంగ్లండ్‌లో ఎలా రాణించాలో చెప్పాడు. ఇక్కడి ఫీల్డింగ్ పొజిషన్స్, పిచ్‌ల గురించి అర్థం అయ్యేలా వివరించాడు. ఎలాంటి మైండ్‌సెట్‌తో బౌలింగ్ చేయాలో సూచించాడు' అని కుల్దీప్ చెప్పుకొచ్చాడు.ఇంగ్లండ్ పిచ్‌లపై వికెట్లు తీయాలంటే అటాకింగ్ అప్రోచ్‌తో ముందుకెళ్లాలని పీటర్సన్ సూచించాడని కుల్దీప్ తెలిపాడు. ఫీల్డ్ పొజిషన్స్ దగ్గర నుంచి బంతులు సంధించడం వరకు అన్నింటా దూకుడుగా ఉంటే సత్ఫలితాలు వస్తాయని చెప్పాడని పేర్కొన్నాడు. బ్యాటర్లను ఎలా ఔట్ చేయాలనే దాని మీదే దృష్టి పెట్టాలని సజెషన్ ఇచ్చాడని తెలిపాడు కుల్దీప్. దీంతో సొంత జట్టుకు వ్యతిరేకంగా, భారత్‌కు అనుకూలంగా పీటర్సన్ వ్యవహరిస్తున్నాడని కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అయితే మరికొందరు మాత్రం పీటర్సన్ ప్రొఫెషనల్ క్రికెటర్ అని, కుల్దీప్ రాణించాలనే ఉద్దేశంతోనే అతడు సలహా ఇచ్చాడని చెబుతున్నారు. కాగా, లీడ్స్ టెస్ట్‌లో ఆడని కుల్దీప్.. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో బరిలోకి దిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

# 6 నెలలు ఒక్క మాట అనలేదు.. హార్దిక్ ఇంత బాధ దాచుకున్నాడా?




ప్రతి క్రికెటర్ తన కెరీర్‌లో ఏదో ఒక దశలో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటారు. ఇటు ఆటలో సరిగ్గా రాణించలేక, అటు జీవితంలోని సమస్యలను పరిష్కరించలేక తీవ్ర ఆటుపోట్లకు గురవుతుంటారు. అయితే ఎన్నో కష్టాలకు ఓర్చి ఆ స్థాయికి చేరిన ప్లేయర్లు.. ఈ దశను కూడా సమర్థవంతంగా దాటి విజయం సాధించడం చూస్తూనే ఉన్నాం. టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా అలాంటి కష్టాల కడలిని దాటి సక్సెస్ అయ్యాడు. గతేడాది ఎన్నో ఇబ్బందులు, సమస్యలు ఎదుర్కొన్నాడు పాండ్యా. ఆ సమయంలో కొన్ని నెలల పాటు ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఉండిపోయాడట. ఈ విషయాన్ని స్వయంగా అతడే బయటపెట్టాడు. ఇంతకీ హార్దిక్ ఏమన్నాడంటే..'దేశం కోరుకున్న విజయం.. 'టీ20 ప్రపంచ కప్-2024 నెగ్గిన క్షణాలు చాలా ఎమోషనల్. మొత్తం దేశం ఈ విజయాన్ని కోరుకుంది. వ్యక్తిగతంగా ఈ గెలుపు నాకు ఎంతో ప్రత్యేకమనే చెప్పాలి. నా చుట్టూ ఎన్నో విషయాలు జరిగాయి. నా విషయంలో చాలా అన్యాయంగా ప్రవర్తించారు. 6 నెలల పాటు నేను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఎవర్నీ ఏమీ అనలేదు. అయితే నా టైమ్ వస్తుందని నాకు తెలుసు. నా సత్తా చాటేందుకు, నేనేంటో నిరూపించుకునేందుకు అవకాశం వస్తుందని తెలుసు. అది వరల్డ్ కప్‌తో తీరింది' అని పాండ్యా చెప్పుకొచ్చాడు.

# యాక్సిడెంట్ తర్వాత డాక్టర్‌ను రిషభ్ పంత్ అడిగిన తొలి ప్రశ్న అదేనట..



టీమిండియా స్టార్ వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్ రిషభ్ పంత్ ప్రస్తుత ఇంగ్లండ్ సిరీస్‌లో అదరగొడుతున్నాడు. తొలి టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు చేశాడు. ఎన్నో రికార్డులను నెలకొల్పాడు. పంత్‌కు గతంలో ఓ భారీ ప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. 2022లో జరిగిన కారు ప్రమాదంలో పంత్ త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే అతడియాక్సిడెంట్ అయి హాస్పిటల్‌కు తీసుకెళ్లగానే డాక్టర్‌ను చూసిన పంత్.. 'నేను మళ్లీ క్రికెట్ ఆడగలనా' అని ప్రశ్నించాడట. ఈ విషయాన్ని పంత్‌కు చికిత్స అందించిన డాక్టర్ దిన్షా పార్డీవాలా తెలిపారు. పంత్‌కు జరిగిన ఘోరమైన యాక్సిడెంట్ గురించి దిన్షా వెల్లడించారు. 'హాస్పిటల్‌కు తీసుకొచ్చే సమయానికి పంత్ కుడి మోకాలు భాగం పక్కకు జరిగిపోయింది. కుడి చీలమండకు కూడా పెద్ద గాయం అయింది. అతడి శరీరంలో పలు చోట్ల గాజు పెంకులు ఉన్నాయి. చర్మం చీరుకుపోయింది అలాంటి పరిస్థితుల్లో హాస్పిటల్‌కు వచ్చిన పంత్.. 'నేను మళ్లీ ఆడగలానా' అని అడిగాడు' అని డాక్టర్ గుర్తు చేసుకున్నారు.'అంత పెద్ద ప్రమాదం నుంచి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ ప్రమాదంలో అతడి రక్తనాళాలు దెబ్బతినలేదు. దీంతో ప్రధాన అవయవాలకు ఇబ్బంది కలగలేదు. మోకాలికే పెద్ద దెబ్బ తగిలింది. చర్మం బాగా చీరుకుపోవడంతో కదలడానికి చాలా ఇబ్బంది పడ్డాడు. బ్రష్ చేయడానికి కూడా చాలా కష్టపడేవాడు. పంత్ మోకాలికి సర్జరీ చేసి నాలుగు లిగ్మెంట్లను అమర్చాం' అని డాక్టర్ తెలిపారు. దాదాపు రెండేళ్ల విశ్రాంతి తీసుకున్న పంత్ 2024లో తిరిగి మైదానంలోకి అడుగుపెట్టాడు.

# హ్యాట్రిక్‌పై అల్కారజ్ గురి




లండన్: డబుల్ డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్ మరోసారి వింబుల్డన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. సోమవారం నుంచి జరిగే గ్రాస్‌కోర్ట్ గ్రాండ్‌స్లామ్‌లో రెండో సీడ్ అల్కారజ్ విజేతగా నిలిస్తే.. దిగ్గజం రోజర్ ఫెదరర్ తర్వాత హ్యాట్రిక్ సాధించిన ఆటగాడిగా చరిత్ర సృష్టిస్తాడు. గతేడాది అల్కారజ్ చేతిలో ఓడి రన్నర్‌పగా నిలిచిన సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ తన 25వ టైటిల్ కలను నెరవేర్చుకోవాలన్న పట్టుదలతో ఉన్నాడు. కానీ, ఇటీవలి ఫామ్‌తోపాటు జొకో ఫిట్‌నెస్ చూస్తుంటే కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆరో సీడ్‌గా బరిలోకి దిగుతున్న జొకో తొలి రౌండ్‌లో అలెగ్జాండర్ ముల్లర్‌తో తలపడనున్నాడు. అయితే, క్వార్టర్స్‌లో నాలుగో సీడ్ జాక్ డ్రేపర్ రూపంలో నొవాక్‌కు అసలుసిసలు సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. ఇది గట్టెక్కితే సెమీస్‌లో టాప్ సీడ్ జానిక్ సినర్‌తో ఆడాల్సి రావచ్చు. తొలి రౌండ్‌లో లూకా నర్డీ (ఇటలీ)తో సినర్, ఫాబియో ఫాగ్‌నీ (ఇటలీ)తో అల్కారజ్ ఆడనున్నారు. మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్, మెద్వెదెవ్, ఆండీ రుబ్లెవ్, హోల్గర్ రూన్ కూడా సత్తా చాటాలనుకొంటున్నారు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ అరియానా సబలెంక, ఫ్రెంచ్ ఓపెన్ విజేత కొకొ గాఫ్, 8వ సీడ్ ఇగా స్వియటెక్ మధ్య పోటీ తీవ్రంగా ఉంది. 2016లో సెరెనా విలియమ్స్ ఏడో టైటిల్ సాధించిన తర్వాత.. వరుసగా కొత్త చాంపియన్లే వస్తున్నారు. కాగా, డిఫెండింగ్ చాంప్ బార్బరా క్రెజికోవా పేలవ ఫామ్ కొనసాగుతుండడంతో ఆమెపై పెద్దగా అంచనాలు లేవు. సబలెంక ముందుకు సాగితే.. క్వార్టర్స్‌లో మాడిసన్ కీస్‌ను ఎదుర్కోవాల్సి రావచ్చు. గతేడాది రన్నరప్, నాలుగో సీడ్ జాస్మిన్ పాలినీకి క్వార్టర్స్‌లో క్విన్‌వెన్ జాంగ్ రూపంలో గట్టిసవాల్ ఎదురుకావచ్చు. రెండో సీడ్ కొకొ గాఫ్.. తొలి రౌండ్‌లో దయానా ఎస్ట్రీమ్‌స్కాతో, కుదర్మెటోవాతో స్వియటెక్ తలపడనున్నారు. రిబకినా, మిర్రా ఆండ్రీ కూడా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకొంటున్నారు.

# కేఎల్ రాహుల్ ఇక్కడితో ఆగడు.. ఈ మాటలు వింటే గూస్‌బంప్సే!




భారత స్టైలిష్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. బ్యాట్ చేతికి అందుకుంటే చాలు పరుగుల వరద పారిస్తున్నాడు. చాంపియన్స్ ట్రోఫీ-2025 నుంచి అతడి బ్యాట్ ఓ రేంజ్‌లో గర్జిస్తోంది. జట్టు గెలుపు కోసం డిఫెన్స్ చేయడంతో పాటు పించ్‌హిట్టర్‌లా ఫోర్లు, సిక్సులతో విరుచుకుపడేందుకూ రాహుల్ వెనుకాడటం లేదు. చాంపియన్స్ ట్రోఫీ-2025, ఐపీఎల్-2025లో కొన్ని అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో అందరి మనసుల్ని దోచుకున్న రాహుల్.. ఇంగ్లండ్ పర్యటనలోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. లీడ్స్ వేదికగా స్టోక్స్ సేనతో జరిగిన తొలి టెస్ట్‌లో క్లాసికల్ నాక్‌తో ఆకట్టుకున్నాడు. సెంచరీతో జట్టు విజయం కోసం శాయశక్తులా ప్రయత్నించాడు. అయితే రాహుల్ ఇక్కడితో ఆగడని.. ఇక ముందు అతడి బ్యాట్ మరింతగా గర్జిస్తుందని సీనియర్ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ అంటున్నాడు.'లీడ్స్ టెస్ట్‌లో రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ అద్భుతంగా ఆడారు. పంత్ టెస్టుల్లో ఆడటాన్ని ఇష్టపడతాడు. ఈ మధ్య అతడు ఎక్కువగా పరుగులు చేయలేదు. అందుకే రాణించాలనే కసి, పట్టుదలతో కనిపించాడు. లీడ్స్‌లో పరుగులు చేయాలనే దాహంతో బ్యాటింగ్ చేశాడు. దీన్నే ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లోనూ కొనసాగిస్తాడని భావిస్తున్నా. అయితే పంత్‌తో పాటు తప్పక రాణించాల్సిన పరిస్థితుల్లో మరో బ్యాటర్ ఉన్నాడు. అతడే కేఎల్ రాహుల్. అతడు టీమ్‌లో సీనియర్ క్రికెటర్. లీడ్స్ టెస్ట్ ఫామ్‌నే రాహుల్ సిరీస్ మొత్తం కొనసాగించాల్సి ఉంటుంది. భారత క్రికెట్‌కు అతడి అవసరం ఉంది. ఒక సెంచరీతో అతడు ఆగడు. వన్ మ్యాచ్ పెర్ఫార్మర్‌గా మిగలడు' అని మంజ్రేకర్ చెప్పుకొచ్చాడు. కాగా, రెండో టెస్ట్ కోసం రాహుల్ తీవ్రంగా కసరత్తులు చేస్తున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

టుడే బిజినెస్

# గుడ్ న్యూస్.. రూ.98 వేల దిగువకు బంగారం..



కొంత కాలంగా ఆల్‌టైమ్ గరిష్టంలో ట్రేడ్ అయిన బంగారం, వెండి ధరలు మళ్లీ దిగి వస్తున్నాయి. 10 గ్రాముల బంగారం ధర మళ్లీ లక్ష రూపాయల కిందకు దిగివచ్చింది. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (జూన్ 30న) ఉదయం 6.30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. రూ. 97,410కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 89, 290కి చేరింది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 97, 560కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 89, 440కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 97, 410కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 89, 290కి చేరింది. వెండి ధరలు కేజీకి రూ. 100 మేర తగ్గాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

# వారారంభంలో స్వల్ప నష్టాల్లో నిఫ్టీ, సెన్సెక్స్.. ర్యాలీ కొనసాగిస్తున్న మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్




బిజినెస్ న్యూస్, 30 జూన్: ఇంట్రాడేలో నిఫ్టీని 25,500 కంటే దిగువకు లాగడంతో భారత ఈక్విటీ సూచీలు వారాన్ని ఈ ఉదయం బలహీనంగా ప్రారంభించాయి. మెటల్, ఆటో, రియాల్టీ, పేర్లలో బలమైన అమ్మకాలు కనిపించాయి. అయితే, బ్యాంక్, ఐటీ, మీడియాలో కొనుగోళ్లు.. నిఫ్టీ చివరికి 25,500 పైన ముగియడానికి సహాయపడ్డాయి. మార్కెట్లు ముగిసే సమయానికి, సెన్సెక్స్ 452.44 పాయింట్లు లేదా 0.54 శాతం తగ్గి 83,606.46 వద్ద ఉంది. నిఫ్టీ 120.75 పాయింట్లు లేదా 0.47 శాతం తగ్గి 25,517.05 వద్ద స్థిరపడింది.

ఇక, ఇవాళ్టితో కలిపి వరుసగా ఏడవ రోజు కూడా విస్తృత సూచీలు తమదైన శైలిలో ముందుకెళ్లాయి. ఫలితంగా మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.8 శాతం పెరిగాయి. ఒక దశలో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ కూడా నేటి సెషన్‌లో రికార్డు స్థాయిలో 57,614.50 పాయింట్లను తాకింది. అయితే మార్కెట్లు ముగిసే సమయానికి 0.2 శాతం తగ్గి 57,312.75 వద్ద ముగిసింది. టాటా కన్స్యూమర్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, హీరో మోటోకార్ప్, మారుతి సుజుకి నిఫ్టీలో ప్రధానంగా నష్టాలను చవిచూశాయి, ట్రెంట్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారత్ ఎలక్ట్రానిక్స్, జియో ఫైనాన్షియల్ లాభపడ్డాయి. రంగాల పరంగా చూస్తే, బ్యాంక్ ఇండెక్స్ 2.6 శాతం పెరిగింది. ఫార్మా ఇండెక్స్ 0.5 శాతం పెరిగింది. రియాల్టీ, , ఆటో, మెటల్ నష్టాల్లో ముగిశాయి.

ఇక, స్టాక్ విషయంలో, తెలంగాణలో రియాక్టర్ పేలుడు కారణంగా సిగాచి ఇండస్ట్రీస్ షేర్లు 11% క్షీణించాయి. డోక్సోరుబిసిన్ హైడ్రోక్లోరైడ్ ఇంజెక్షన్‌కు ఆమోదం లభించడంతో అలెంబిక్ ఫార్మా షేర్లు దాదాపు 5% పెరిగాయి. ప్రభుత్వం ఆర్థిక బిడ్ దశకు చేరుకోవడంతో బ్యాంక్ షేర్లు 1 పెరిగాయి. టొరెంట్ ఫార్మా రూ. 25,689 కోట్ల విలువైన నియంత్రణ వాటాను కొనుగోలు చేయడంతో కెమికల్స్ షేర్లు 6% పడిపోయాయి. విభాగం 540- సోలార్ మాడ్యూల్ ఆర్డర్‌ను గెలుచుకున్న తర్వాత వారీ ఎనర్జీస్ షేర్లు 7% పెరిగాయి. మరియు రాజీనామాతో కర్ణాటక బ్యాంక్ షేర్లు 5% పడిపోయాయి.

మరోవైపు, (సోమవారం) బీఎస్ఈలో 150 కి పైగా స్టాక్‌లు 52 వారాల గరిష్ట స్థాయిలను తాకాయి. వాటిలో దీపక్ ఫెర్టిలైజర్స్, సిటీ యూనియన్ బ్యాంక్, ఇఐడి ప్యారీ, లారస్ ల్యాబ్స్, ఆదిత్య బిర్లా క్యాపిటల్, లాయిడ్స్ మెటల్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎస్ఆర్ఎఫ్, పూనవల్లా ఫిన్‌కార్ప్, అబాట్ ఇండియా, రామ్‌కో సిమెంట్స్, ఎల్‌టి ఫైనాన్స్, రెడింగ్టన్, జిల్లెట్ ఇండియా, హ్యుందాయ్ మోటార్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, మాక్స్ ఫైనాన్షియల్, సోలార్ ఇండస్ట్రీస్ ఉన్నాయి.

గ్లోబల్ మార్కెట్లు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వాణిజ్య ఒప్పందాల ఆశలు యూఎస్ మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపగా, యుఎస్ ఫెడరల్ రిజర్వ్ నుండి వడ్డీ రేటు కోతలకు అంచనాలు పెరగడం యూఎస్ మార్కెట్లలో ర్యాలీ కనిపించింది. దీంతో శుక్రవారం ఎస్ పి 500, నాస్‌డాక్ ఇండెక్స్ పరుగులెత్తాయి. ఇక, ఇవాళ (సోమవారం) ఆసియా మార్కెట్లు పెరగగా, యూరోపియన్ మార్కెట్లు స్వల్పంగా తగ్గుదల నమోదు చేశాయి.

# జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ అప్‌డేట్.. కనీస పెట్టుబడి ఎంతో తెలుసా..




జియో బ్లాక్ రాక్ మ్యూచువల్ ఫండ్ సోమవారం (జూన్ 30, 2025) తొలి మ్యూచువల్ ఫండ్ ఆఫర్లను ప్రారంభించింది. ఈ కొత్త ఆఫర్లలో మూడు ఓపెన్ ఎండెడ్ డెట్ స్కీమ్‌లు ఉన్నాయి. వీటిలో జియో బ్లాక్‌రాక్ మనీ మార్కెట్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ లిక్విడ్ ఫండ్, జియో బ్లాక్‌రాక్ ఓవర్‌నైట్ ఫండ్ కలవు. ఈ మూడు ఫండ్‌ల కోసం న్యూ ఫండ్ ఆఫర్ జూలై 2 వరకు తెరిచి ఉంటుంది. వీటిలో మీరు కేవలం 500 రూపాయల పెట్టుబడితో కూడా ఈ స్కీమ్‌లలో ఇన్వెస్ట్ చేయవచ్చు. ఈ ఆఫర్‌లను జియో బ్లాక్‌రాక్ ప్లాట్‌ఫామ్ లేదా జీరోధా వంటి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా సబ్‌స్క్రైబ్ చేసుకోవచ్చు.

జియో బ్లాక్‌రాక్ ఒప్పందం..

ముకేశ్ అంబానీ నేతృత్వంలోని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, అమెరికాకు చెందిన ప్రముఖ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ బ్లాక్‌రాక్ సంయుక్తంగా ఈ మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని ప్రారంభించాయి. మే నెలలో సెబీ (సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా) నుంచి ఈ వ్యాపారానికి అనుమతి లభించింది. ఓపెన్ ఎండెడ్ ఫండ్‌లు అంటే పెట్టుబడిదారులు ఎప్పుడైనా ఈ స్కీమ్‌లలో షేర్లను కొనుగోలు చేయవచ్చు లేదా విక్రయించవచ్చు.

జియో బ్లాక్‌రాక్ లిక్విడ్ ఫండ్

ఈ ఫండ్ తక్కువ వ్యవధిలో స్థిరమైన ఆదాయాన్ని కోరుకునే పెట్టుబడిదారుల కోసం రూపొందించబడింది. ఇది 91 రోజుల వరకు రెసిడ్యూవల్ మెచ్యూరిటీ ఉన్న మనీ మార్కెట్, డెట్ ఇన్‌స్ట్రుమెంట్‌లలో పెట్టుబడి పెడుతుంది. ఈ స్కీమ్‌లో ఎక్సిట్ లోడ్ గ్రేడెడ్ విధానంలో ఉంటుంది. మొదటి రోజు 0.0070% నుంచి మొదలుకాగా, 7వ రోజు నాటికి ఎక్సిట్ లోడ్ పూర్తవుతుంది. ఈ ఫండ్‌లో రిస్క్ స్థాయి తక్కువ నుంచి మోడరేట్ వరకు ఉంటుంది. ఇది సురక్షితమైన పెట్టుబడి ఎంపిక కోరుకునేవారికి బెస్ట్ ఛాయిస్.

మనీ మార్కెట్ ఫండ్

ఈ ఫండ్ కూడా స్థిరమైన ఆదాయాన్ని అందించడానికి రూపొందించబడింది. కానీ ఇది ఒక సంవత్సరం వరకు రెసిడ్యూవల్ మెచ్యూరిటీ ఉన్న మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్‌లలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇది కొంచెం ఎక్కువ వ్యవధి కోసం తక్కువ రిస్క్‌తో పెట్టుబడి పెట్టాలనుకునేవారికి మంచి ఛాయిస్. దీనిలో రిస్క్ స్థాయి కూడా తక్కువ నుంచి మోడరేట్ వరకు ఉండే ఛాన్సుంది.

జియో బ్లాక్‌రాక్ ఓవర్‌నైట్ ఫండ్

ఈ ఫండ్ అతి తక్కువ వ్యవధి కోసం పెట్టుబడి పెట్టాలనుకునేవారికి రూపొందించబడింది. ఇది ఒక రాత్రి మెచ్యూరిటీ ఉన్న డెట్, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్‌లలో పెట్టుబడి పెడుతుంది. ఈ ఫండ్ వడ్డీ రేటు రిస్క్‌ను తగ్గించడానికి రూపొందించబడింది. ఇది ఒక రోజు లేదా అంతకంటే ఎక్కువ కాలం పెట్టుబడి పెట్టాలనుకునేవారికి అనువుగా ఉంటుంది. దీనిలో రిస్క్ స్థాయి తక్కువ నుంచి మోడరేట్ వరకు ఉంటుంది.

# నయారా ఎనర్జీకి రాస్‌నెఫ్ట్ గుడ్‌బై




న్యూఢిల్లీ: దేశ పెట్రోలియం రంగంలో మరో భారీ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. గుజరాత్‌లోని వడినార్ వద్ద రెండు కోట్ల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన నయారా ఎనర్జీ రిఫైనరీ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని రష్యా చమురు దిగ్గజం రాస్‌నెఫ్ట్ భావిస్తున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్టు ఈక్విటీలో ఈ కంపెనీకి 49.13 శాతం వాటా ఉంది. ఈ వాటాను విక్రయించేందుకు రాస్‌నెఫ్ట్ అధికారులు గత ఏడాది కాలంలో మూడు సార్లు ముంబై, ఢిల్లీ వచ్చి వివిధ కంపెనీలతో చర్చలు జరిపినట్టు సమాచారం. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)తో కూడా ప్రస్తుతం ఇందుకోసం ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. అయితే దీనిపై రెండు కంపెనీలు అధికారికంగా నోరు మెదపడం లేదు. రాస్‌నెఫ్టతో పాటు ఈ రిఫైనరీలో 24.5 శాతం వాటా కలిగిన మరో రష్యా కంపెనీ యూసీపీ ఇన్వెస్టమెంట్ గ్రూప్ కూడా తన వాటా అమ్మకానికి పెట్టినట్టు తెలుస్తోంది.

2017లో ఎస్సార్ నుంచి కొనుగోలు: ఎస్సార్ ఆయిల్‌గా ఉన్న ఈ రిఫైనరీ ప్రాజెక్ట్ ఈక్విటీలో మెజారిటీ వాటాను రష్యా కంపెనీలు 2017లో 1,290 కోట్ల డాలర్లకు కొనుగోలు చేశాయి. అమెరికా, ఈయూ ఆంక్షలతో ఈ రిఫైనరీ ప్రాజెక్టు లాభాలను తమ దేశానికి తరలించడం రష్యా కంపెనీలకు ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. దీంతో నయారా ఎనర్జీ కంపెనీ నుంచి తప్పుకోవడమే మేలనే నిర్ణయానికి వచ్చాయి. ఇందుకోసం ఆర్ఐఎల్‌తో సహా సౌదీ అరామ్కో, అదానీ గ్రూప్, ఓఎన్‌జీసీ/ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ)లను రష్యా కంపెనీలు సంప్రదించాయి. అయితే ఈక్విటీలో తమ వాటాకు రష్యా కంపెనీలు 2,000 కోట్ల డాలర్లు (సుమారు రూ1.7 లక్షల కోట్లు) అడిగినట్టు సమాచారం. ఇది చాలా ఎక్కువనే అంచనాతో ఈ కంపెనీలు నయారా కొనుగోలుకు పెద్దగా ఆసక్తి చూపలేదు.

# టోరెంట్ ఫార్మా చేతికి జేబీ కెమికల్స్

న్యూఢిల్లీ: భారత ఫార్మా రంగంలో మరో భారీ డీల్ చోటు చేసుకుంది. జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్‌ను టోరెంట్ ఫార్మా రూ.19,500 కోట్లకు కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం జేబీ కెమికల్స్ ఈక్విటీలో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థ కేకేఆర్ అనుబంధ సంస్థ.. టావ్ ఇన్వెస్టమెంట్ హోల్డింగ్ పీటీఈ లిమిటెడ్‌కు ఉన్న 46.39 శాతం వాటాను రూ.11,917 కోట్లకు, జేబీ కెమికల్స్ ఉద్యోగుల వద్ద ఉన్న 2.8 శాతం వాటాను రూ.719 కోట్లకు కొనుగోలు చేస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య స్పష్టమైన ఒప్పందం కుదిరినట్టు టోరెంట్ ఫార్మా ఆదివారం ప్రకటించింది. ఇందుకోసం టోరెంట్ ఫార్మా జేబీ కెమికల్స్ ఒక్కో షేరుకు రూ.1,600 చొప్పున చెల్లించనుంది. ప్రజల వద్ద ఉన్న మరో 26 శాతం వాటాను ఒక్కో షేరు రూ.1,639.18 చొప్పున రూ.1,799.35 కోట్లకు కొనేందుకు త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఈ కొనుగోలుతో ఫార్మా రంగంలో తమ స్థానం మరింత పటిష్ఠం కావడంతో పాటు కాంట్రాక్ట్ రీసెర్చ్, తయారీ రంగంలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని టోరెంట్ పార్మా తెలిపింది.

# వస్తున్నాయ్ జొమాటో విమానాలు

ముంబై/న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ యాప్ జొమాటో సహ వ్యవస్థాపకుడు దీపీందర్ గోయెల్.. ల్యాట్ ఏరోస్పేస్ భాగస్వామ్యంలో ప్రాంతీయ విమానయానంలో ప్రవేశించే యోచన చేస్తున్నారు. జొమాటో సహ వ్యవస్థాపకురాలు సురభి దాస్ లింక్డ్ఇన్ పోస్ట్‌లో ఈ విషయం వెల్లడించారు. దేశంలోని 450 ఎయిర్‌స్ట్రిపలలో 150 మాత్రమే పని చేస్తున్నాయి. అంటే మూడింట రెండు వంతులు ఇప్పటికీ వృధాగానే పడి ఉన్నాయి. వాటిని వినియోగంలోకి తేవడం వల్ల ఇప్పటికీ రోడ్డు లేదా రైలు మార్గాల్లో ప్రయాణిస్తూ గంటలు, రోజులు వృధా చేసుకుంటున్న సగటు జీవులకు తక్కువ వ్యయంతో విమానాల్లో తిరిగే అవకాశం కల్పించవచ్చని ఆమె పేర్కొన్నారు. తాము ప్రారంభించాలనుకుంటున్న ల్యాట్ ఏరోస్పేస్ విమానాలు ఒక పార్కింగ్ లాట్‌తో సమానమైన విస్తీర్ణం ఉండే ఎయిర్-స్టాపలలో టేకాఫ్, ల్యాండింగ్ కాగలవని ఆమె చెప్పారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006